నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

శనివారం | 18 జనవరి 2025 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 87

| పేజీలు 12+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi









## లోకేష్ నేతృత్వంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గారికి కోటి సభ్యత్వాలతో ఘననివాళి

తెలుగునేలపై ఆత్మగౌరవ నినాదం మారుమోగించిన తెలుగు పౌరుషం స్వర్గీయ ఎన్టీఆర్ గారు.
అటువంటి ఎన్టీఆర్ గారు స్థాపించిన పార్టీ తెలుగుదేశం. చరిత్ర సృష్టించడం, రికార్డులు తిరగరాయడం
స్వర్గీయ ఎన్టీఆర్ గారితోనే అలవాటు చేసుకున్న తెలుగుదేశం... నేడు మరో రికార్డును సృష్టించింది.
1 కోటి పైచిలుకు సభ్యత్వాల నమోదుతో సరికొత్త చరిత్రను ఆవిష్కరించింది. యువసారధి నారా లోకేష్ నేతృత్వంలో
టీడీపీ కార్యకర్తలు, నేతలు కలిసి ఎన్టీఆర్ గారికి అందించిన ఘననివాళి ఇది.

### సభ్యత్వ నమోదులో టీడీపీ సాధించిన రికార్డులు

| | | |
|---|---|---|
| మొత్తం సభ్యత్వాలు 1,00,00,000+ (10.05 మిలియన్లు) | 11 నియోజకవర్గాల్లో లక్ష మార్క్‌ను దాటి సభ్యత్వాలు నమోదయ్యాయి | 105 నియోజకవర్గాల్లో 50 వేల మార్క్‌ను దాటి సభ్యత్వాలు నమోదయ్యాయి |

కార్యకర్తల ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచిన నారా లోకేష్



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు... సినీ, రాజకీయ రంగాలలో అద్వితీయ చరిత్రను సొంతం చేసుకున్న చరితార్థుడు, సంక్షేమ యుగానికి ఆద్యుడు...
తెలుగుజాతికి ఆరాధ్యుడు కీ.శే. నందమూరి తారక రామారావు గారి వర్ధంతి సందర్భంగా... ఆ మహనీయుని స్మృతికి నివాళులు.



# విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన విచారణలు వేగవంతం చేయాలి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఉద్యోగుల పనితీరు మీద సున్నితమైన విజిలెన్స్ ఉండాలి. వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉద్యోగుల నిజాయతీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శినిలా పని చేస్తుంది. అయితే ఉద్యోగులపై నమోదు అవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు, చర్యలు ఏళ్ల పాటు పెండింగ్ లో ఉండిపోవడం ఉద్యోగుల పని తీరుపై ప్రభావం చూపిస్తుంది అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. క్రమ శిక్షణ చర్యలు, శాఖపరమైన విచారణలకు సంబంధించినవి ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న అంశంపై ఉప ముఖ్యమంత్రివర్యులు దృష్టి సారించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్., అటవీ, పర్యావరణ శాఖల్లో ఉన్న విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంత కాలంగా పెండింగ్ లో ఉన్నాయి, అందుకుగల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న విషయం శ్రీ పవన్ కళ్యాణ్ గారి దృష్టికి వచ్చింది. ఈ విధంగా కేసులు అపరిష్కృతంగా ఉండటం మూలంగా అధికారులు, సిబ్బంది, ఉద్యోగ విరమణ తర్వాత కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేదు. సిబ్బంది తమ ఉద్యోగ కాల పరిమితిలో పదోన్నతుల్లోనూ వెనుకబడిన వారున్నారని గ్రహించారు. ఈ క్రమంలో విజిలెన్స్ పెండింగ్ కేసులపై నివేదికను మూడు వారాల్లో ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. అభియోగాలు వచ్చిన వారిపై విచారణ ప్రారంభించినపుడు దానికి తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదనీ, ఇది విచారణ జాప్యానికి కారణం అవుతోందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ తన శాఖల పరిధిలో విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా తీసుకునే చర్యల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను సూచించారు.

# రాష్ట్ర ఆదాయం, ఆర్థిక పరిస్థితిపై క్యాబినెట్

**● 62 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 63 అన్నా క్యాంటీన్‌ల ఏర్పాటు ● తాడేపల్లి పరిధిలోని పల్లపు ప్రాంతాలకు వరద నివారణ గోడ నిర్మాణం ● జనాభాను పరిగణనలోకి తీసుకుని సచివాలయాలు, ఉద్యోగుల కేటాయింపులు ● రీ సర్వేపై నిర్ణయం ● ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతం కావాలని సభ్యుల శుభాకాంక్షలు**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా వ్యవసాయం, సహకార అంగాలకు సంబంధించిన అంశాలపై తీసుకున్న నిర్ణయాలు ఆ రంగాలకు ఎంతో చేదోడువాదోడుగా నిలుస్తాయి. ఇంకా అమరావతి, పోలవరం నిర్మాణం, గత ప్రభుత్వంలో జరిగిన నష్టాలను సరి చేసేందుకు మరి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వాటి వివరాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

**వ్యవసాయం మరియు సహకార శాఖ**

2024-25 ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యకలాపాలు కొనసాగించేందుకు అవసరమైన నిధులను నేషనల్ కోఆపరేటివ్ డవలప్మెంట్ కార్పొరేషన్ (గ్రా) నుండి ఎ.పి. స్టేట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (గ్రా) అదనపు ఋణ సౌకర్యంగా రూ.700 కోట్ల మేర ఋణాన్ని పొందేందుకు (ఇప్పటికే పొందిన రూ.6000.00 కోట్ల రుణానికి అదనంగా) ప్రభుత్వ హామీని పొడిగించడం మరియు ప్రభుత్వ గ్యారంటీ కమీషన్‌ను మాఫీ చేయడంతో పాటు ఆ నిధులను స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ () కు బదిలీ చేయడం కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలు మరి కొన్ని సందర్భాల్లో కేవలం 6 లేక 7 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి సొమ్మును జమచేస్తున్నది కూటమి ప్రభుత్వం. ఈ సీజన్ లో 28,083,238 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దాదావు 4.6 లక్షల మంది రైతుల నుండి సేకరించి వారికి రూ.6,469 కోట్లను చెల్లించడం జరిగింది. ఇంకా కొంత ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యంతో ఈ ఋణాన్ని తీసుకోవడం జరుగుచున్నది. ప్రస్తుత సీజన్ లో ధాన్య సేకరణ విషయంలో ఎదురైన మాయిచ్చర్ సమస్యను వచ్చే సీజన్ లో అధిక మించే విధంగా మాయిచ్చర్ ఫుల్ ప్రూఫ్ విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఫెర్రో అల్లాయ్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అభ్యర్థనపై .26 శక్తి (పవర్-) విభాగం, తేదీ: 16.11.2023 లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తేదీ.31-03-2025 వరకు టారిఫ్ విద్యుత్ సుంకంలో అదే తగ్గింపును కొనసాగించేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. దీని మూలంగా దాదావు రూ.300 కోట్ల మేర అదనపు భారం ప్రభుత్వం మీద పడుతుంది. ఈ ఫెర్రో అల్లాయ్స్ లో పని చేస్తున్న దాదావు 40 వేల మంది ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో పల్వంచలోని నవబాగ్ ఫెర్రో అల్లాయ్స్ కు కూడా ఇటు వంటి సహకారాన్ని ఈ ప్రభుత్వం అందించడం జరిగింది.

**పురపాలక పట్టణాభివృద్ధి శాఖ.**

వివిధ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో మిగిలిన 62 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 63 అన్నా క్యాంటీన్‌లను (ఒక్కో అన్న క్యాంటీన్ ను రూ.61 లక్షలతో) మొత్తం అంచనా వ్యయం రూ.38.43 కోట్లతో ఏర్పాటు చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే 203 అన్నా కాంటిన్లను ఏర్పాటు చేయడం జరిగింది. పూటకు కేవలం రూ.5/- లకే కడుపు నిండా శుచి కరమైన భోజనం పెట్టే మహత్తర కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం చేపట్టింది. ఈ క్యాంటీన్ల నిర్వహణను మరింత మెరుగు పర్చేందుకు ప్రత్యేకంగా సొసైటీని ఏర్పాటు చేయాలని, ఒక మేనేజ్మెంట్ కమిటీ, ఒక ఎడ్వైజరీ కమిటీని కూడా ఏర్పాటు చేసే ప్రతిపాదనలను రూపొందించాలని సి.ఎం.సూచించారు.

**జలవనరుల శాఖ.**

నాగావళి నదిపై సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ ఎడమవైపు హెడ్ స్లూయిస్‌కు ఎడమవైపు 1.0 మెగావాట్ల మినీ హైడల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన / మే ఎన్‌కాన్స్ () లిమిటెడ్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

**జలవనరుల శాఖ.**

నాగావళి నదిపై సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ ఎడమ హెడ్ స్లూయిస్‌కు కుడివైపున 2.7 మెగావాట్ల మినీ హైడల్ స్కీమ్‌ను ఏర్పాటు చేయడానికి / మే ఎన్‌కాన్స్ () లిమిటెడ్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. మినీ హైడల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణ అనుకూల గ్రీన్ పవర్ ఉత్పత్తికి అవకాశం కలుగుతుంది. పాజెక్ట్ సమీప ప్రాంతాల్లో వోల్టేజ్ పరిస్థితులను మెరుగుపడటంతో పాటు స్థానికంగా ఉపాధి కల్పన, వ్యవస్థాపకత అభివృద్ధి మరియు నీటి రాయల్టీ ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం చేకూరనుంది. భవిష్యత్తులో ఏర్పాటు చేసే చిన్న చిన్న పవర్ ప్లాంట్లలో ఎస్.హెచ్.జి. మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారా ఉపాధి కల్పిస్తూ మహిళా సాధికారత సాధనకు తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**జలవనరుల శాఖ.**

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం తాడేపల్లి గ్రామ పరిధిలో ప్రకాశం బ్యారేజికి దిగువన కృష్ణా నదికి కుడి మార్జిన్ లో 0.9 నుండి 2.61 వరకు వరద రక్షణ గోడ నిర్మాణ పనులకు రూ.294.20 కోట్లతో పరిపాలన అనుమతి మంజూరీ కోసం చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో కృష్ణా నది వరద ఉధృతి కారణంగా తాడేపల్లి పరిధిలోని సుందరయ్య నగర్, మహాబాదు కాలనీ తదితర ప్రాంతాలు ముంపునకు గురై బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వరద సమయంలో ఈ ముంపు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక పునరావాస కార్యక్రమాలను నిర్వహించాల్సి వస్తున్నది. విజయవాడ వద్ద కృష్ణా నది ఎడమవైపు మార్జిన్ లో వరద రక్షణ గోడను నిర్మించడం వల్ల గత ఏడాది సెప్టెంబరులో కృష్ణా నది వరద సమయంలో 11.43 లక్షల క్యూసిక్కుల వరద ప్రవాహం వచ్చినప్పటికీ కృష్ణ లంక, రాణీగారి తోట తదితర పల్లపు ప్రాంతాలు ముంపుకు గురికాకుండా కాపాడటం జరిగింది. ఇదే తరహాలో కృష్ణా నది కుడివైపు మార్జిన్ లో ప్రకాశం బ్యారేజ్ దిగువన కూడా శాశ్వత ప్రాతిపదికన వరద రక్షణ గోడను నిర్మించాలని తాడేపల్లి పరిధిలోని సుందరయ్య నగర్, మహాబాదు కాలనీ తదితర పల్లపు ప్రాంతాల ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ వరద రక్షణ గోడ నిర్మాణానికి మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

**రెవిన్యూ శాఖ ( రెవిన్యూ స్టాంప్స్).**

ఇండస్ట్రియల్ కారిడార్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (గ్రా) - స్పెషల్ పర్పస్ వెహికల్ () కు వైఎస్ఆర్ కడప జిల్లా సి.కె.దిన్నె మండలం కొప్పర్తి మరియు తాడిగొట్ల గ్రామాల్లోని 2,595.74 ఎకరాల భూమిని బదిలీ చేసేందుకు అవసరమైన సేల్ డీడ్ ఎగ్జిక్యూషన్ కు ఇండియన్ స్టాంప్ యాక్ట్, 1899లోని సెక్షన్ 9(1)(ఎ) కింద స్టాంప్ డ్యూటీని మరియు రిజిస్ట్రేషన్ చట్టం, 1908 సెక్షన్ 78 కింద రిజిస్ట్రేషన్ ఫీజును మినహాయించడానికి చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

## షా పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పురంధేశ్వరి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హోం శాఖామాత్యులు అమిత్ షా పర్యటన లో భాగంగా కొండపావులూరు లో ఎన్ ఐ డి ఎం, ఎన్ డి ఆర్ ఎఫ్ ప్రారంభోత్సవం సందర్భంగా జరగనున్న ప్రదేశాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభ తదితర అంశాలపై అక్కడ అందుబాటులో ఉన్న అధికారులు తో చర్చించారు. అమిత్ షా జీ ఇక్కడ ప్రాంగణానికి చేరుకుని, వెళ్ళేంత వరకు జరిగే కార్యక్రమాల వివరాలు పై కొద్దిసేపు అధికారులు తో పురంధేశ్వరి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో బిజెపి సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయం. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. విశాఖ ఉక్కుకు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని చంద్రబాబు అన్నారు.

## విశాఖకు పూర్వ వైభవం-మంత్రి లోకేష్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కును కాపాడుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని మంత్రి లోకేష్ తెలిపారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ కష్టాల్లో కూరుకు పోయిన విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వవైభవం తీసుకొస్తుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు కొత్త ఊపిరి అందించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి కుమార స్వామికి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరవున ధన్యవాదాలు. తెలిపారు. ఇది ఆత్మగౌరవం కోసం పోరాడిన విశాఖ ఉక్కు కార్మికుల విజయం. గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి గారు అధికారాన్ని సొంత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం చూశాం. కేవలం అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే కేంద్రాన్ని ఒప్పించి ప్రత్యేక ప్యాకేజీ సాధించిన ప్రజా నేత చంద్రన్న పాలనలో రాష్ట్రానికి జరుగుతున్న మేలు కళ్లారా చూస్తున్నాం. సాహో నమో... సాహో చంద్రన్న.అని కొనియాడారు.

## విశాఖ స్టీల్ కార్మికుల సంబరాలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం శుభవార్త చెప్పింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. స్టీల్ ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజ్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినందు గాను ప్రధాని మోదీకి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సైతం కేంద్రానికి థ్యాంక్స్ చెప్పారు. స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం నిధులు కేటాయించిన సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు కార్మికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు భీమిలి నియోజకవర్గం శాసన సభ సభ్యుడు గంటా శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అనసూరి మధుసూదన రావు త్రిత్రులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కుకు కొత్త ఊపిరి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ ఉక్కుకు కొత్త ఊపిరులూదిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదం వెనుక దాగున్న తెలుగుప్రజల భావోద్వే గాలని, దాని ప్రతిష్టను తెలియజేస్తూ పలుమార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,, భారత ప్రధాని మోదీతో సహ కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలకు దక్కిన ఫలితమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ గారు నేడు అధికారి కంగా రూ.11,440 కోట్లతో ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం కూటమి ప్రభుత్వం సాధించిన ఘనవిజయం. నాడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడుగారే చొరవతీసుకుని స్వర్గీయ వాజ్ పేయ్ గారు ప్రధానిగా ఉన్న సమయంలో రూ.1600 కోట్ల రుణాలను మాఫీ చేసిన విషయం చెప్పుకోవడం కూడా అనివార్యం. చంద్రబాబు గారి దార్శనికత, చిత్తశుద్ధి, అంకితభావానికి నిదర్శనం.మెడలు వంచుతామని ప్రజలకిచ్చిన మాటను వమ్ము చేస్తూ 23 మంది ఎంపీలనిచ్చినా తలొగ్గి గత జగన్ ప్రభుత్వం మొక్కుబడిగా లేఖలు రాసి చేతులు దులువుకుంది. కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన మాటను చేతల్లో నిలబెట్టు కుంది. ప్రధాన మంత్రి మోదీగారికి, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్ గారికి, కుమారస్వామిగారికి, అశ్విని వైష్ణవ్ గారికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల తరవున ప్రత్యేక ధన్యవాదాలు.

# ఏపీతో కలిసి పని చేయడానికి సిద్ధం

**● ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తాం ● స్వర్ణాంధ్ర-2047 సాధనకు తోడ్పడతాం ● మా సేవలు వినియోగించుకోండి ● ఏపీని కోరిన ఎన్ఐఎస్జీ ● ఆర్టీజీఎస్ ప్రభుత్వాధికారులతో సమావేశం**




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్తో కలిసి పని చేయడానికి తాము ఎంతో ఆసక్తితో ఉన్నామని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ ఐ ఎస్ జీ) సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్ అన్నారు. ప్రభుత్వ శాఖలకు కావాల్సిన సాంకేతిక సహకారం అందివవడానికి తాము సుముఖంగా ఉన్నామన్నారు. శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో ఎన్ఐఎస్జీ సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వాధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాజీవ్ బన్సల్ మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహ వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న వివిధ కార్యకలాపాల గురించి కూలంకుషంగా వివరించారు. ఆయా రాష్ట్రాలకు వారి అవసరాలను బట్టి ఈ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న సరికొత్త టెక్నాలజీలను ప్రభుత్వాలు సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవసరమైన సహకారం తాము అందిస్తామని చెప్పారు. తమది ఎలాంటి లాభాపేక్ష లేనటువంటి సంస్థని తెలిపారు. తక్కువ ఖర్చుతోనే ప్రభుత్వానికి తాము కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తామన్నారు. గత రెండు దశాబ్దాలలో తమ సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. 30 వేల మందికిపైగా వివిధ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ కల్పించామని, 200లకుపైగా ప్రాజెక్టులను వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించామన్నారు. ఆంధ్రప్రదేశ్ తమ సంస్థకు మొట్టమొదటి ప్రమోటర్ గా పనిచసిందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో మరింత దృఢమైన భాగస్వామ్యం ఏర్పరచుకుని ఏపీ ప్రభుత్వంలో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించాలని, ఏపీ ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందించాలని తమ సంస్థ ఎదురు చూస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా రూపొందించిన స్వర్ణాంధ్ర2047 లక్ష్యాల సాధనలో కూడా కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము ఆసక్తిగా ఎదురు చూస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్ ఐఎస్జీతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉందన్నారు. ప్రభుత్వ శాఖలు తమ కార్యకలాపాలు అమలు చేసే సందర్భంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అవసరమని, ఆ దిశగా ఈ సంస్థ సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే డీప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర రంగాలపై చాలా చురుగ్గా పనిచేస్తోందని, ఈ దిశగా ఎన్ ఐఎస్జీ సహకారం కూడా తీసుకుంటామన్నారు. ఐటీ కార్యదర్శి ఎన్. యువరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో అమరావతిలో కూడా ఎన్ఐఎస్జీ ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే సముచితంగా ఉంటుందని సూచించగా దానికి ఆ సంస్థ ప్రతినిధుల సానుకూలంగా స్పందించారు. ఎన్ ఐ ఎస్ జీ సీఈఓ, ఆ సంస్థ ప్రతినిధుల బృందానికి ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్ స్వాగతం పలికారు.


## సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్‌పై విచారణకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్ గా వ్యవహరించిన సునీల్ కుమార్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు అనేక ఆరోపణలు ఉన్నాయి. తాజాగా, సునీల్ కుమార్ పై విచారణకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సునీల్ కుమార్ పై ఉన్న ఆరోపణల విచారణ కోసం ప్రత్యేకంగా విచారణ అథారిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అథారిటీలో ఇద్దరు విచారణ అధికారులను నియమించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఈ అథారిటీలో విచారణ అధికారులుగా వ్యవహరిస్తారు. సునీల్ కుమార్ పై విచారణ పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# మానవత్వం చాటుకున్న ఏపీ సీఎం చంద్రబాబు

**● నారావారి పల్లి పర్యటనలో పలువురి సమస్యలకు పరిష్కారం ● అర్జీదారులకు ఆపన్న హస్తం ● సీఎం సహాయ నిధి నుంచి 11 మందికి రూ.43.50 లక్షల ఆర్థిక సాయం ● చెక్‌లను అందచేసిన జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఏ పులివార్తి నాని ● మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పిన అర్జీదారులు**






ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ముఖ్యమంత్రి చంద్రగిరి మండలం నారావారిపల్లెకి తన స్వంత గ్రామానికి సంక్రాంతికి విచ్చేసిన సమయంలో తనను కలిసిన పలువురు అర్జీదారుల సమస్యలను సావధానంగా విని ఆపన్న హస్తం అందించారు. 24 గంటల పని దినాల సమయంలోవు 11 మందికి చంద్రగిరి, రామచంద్రపురం, తిరుపతి రూరల్, పులిచెర్ల దొరవారి సత్రం మండలాలకు చెందిన వారికి సుమారు రూ. 34.50 లక్షల ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందించి తమ మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. పలువురు అర్జీదారులు ఎంతో మంచి హృదయంతో వారిని ఆదుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలువుతూ ముఖ్యమంత్రి చల్లగా ఉండాలని దీవించారు. చెక్కులను జిల్లా కలెక్టరేట్ తిరుపతి నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మరియు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, జె.సి. శుభం బన్సల్ తో కలిసి అర్జీదారులకు అందజేశారు.

**లబ్దిదారుల స్పందన**

నా పేరు కె. లావణ్య / జగదీశ్వర్ రెడ్డి, మాది రామచంద్రపురం మండలం, సి.రామాపురం గ్రామం నా కుమారుడు కె. అశ్విక్ రెడ్డికి 13 నెలలు, వెన్నెముక సమస్య ఉన్నందున అనేక ఆసుపత్రులకు తిరిగి వైద్యం చేయించడానికి చాలా ఖర్చు అయ్యింది. ఆర్థికంగా చాలా ఇబ్బందులుపడ్డాము. రాష్ట్ర ముఖ్యమంత్రి గారు నారావారిపల్లికి వచ్చిన సందర్భంగా మేము అక్కడికి వెళ్లి మా సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పదించి మాకు సిఎం రిలీఫ్ ఫండ్ క్రింద 3 లక్షలు మంజూరు చేసారని, మాకు తక్షణ సహాయం చేసిన ముఖ్యమంత్రి గారికి మా ధన్యవాదాలు. చంద్రగిరి మండలం ఐతేపల్లి గ్రామానికి చెందిన ఎ. పట్టాభి రెడ్డి మాట్లాడుతూ నేను పెరాలసిస్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాను. ఆసుపత్రికి మందుల ఖర్చులకు చాలా ఖర్చు అయ్యేది నా సమస్యను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ క్రింద ఒక లక్ష రూపాయలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి గారికి నా కృతజ్ఞతలు. నా పేరు నాగరత్నమ్మ మాది చంద్రగిరి మండలం, నారావారి పల్లి గ్రామం నా భర్త అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు మరియు మా ఇల్లు శిథిలావస్థలో ఉన్నదని ఆర్థిక స్తోమత లేనందున ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యమంత్రి గారు నారావారిపల్లికి వచ్చారని తెలిసి ఆయన దృష్టికి తీసుకెళ్ళి కలవగా ఆయన తక్షణమే స్పందించి నా భర్త మందులకు, ఇంటి మరమ్మతులకు సిఎం రిలీఫ్ ఫండ్ క్రింద రెండు లక్షలు మంజూరు చేసారని, మాకు ఆర్థిక సహాయం చేసిన ముఖ్యమంత్రికి మనసార ధన్యవాదాలు తెలువుతూ ఎప్పటికీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలని కోరుకుంటూ ధన్యవాదాలు తెలిపారు. చంద్రగిరి మండలం ఎ రంగంపేట గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి మాట్లాడుతూ నాకు షుగర్ సమస్య ఉన్నందున కాలు సెప్టిక్ అయ్యి ఆపరేషన్ చేసారు. మందులకు చాల ఖర్చులు అవుతున్నాయి. ఆర్థిక స్తోమత లేక సంపాదించడానికి ఎలాంటి ఆస్కారం లేక చాల ఇబ్బంది పడుతున్నాను. సంక్రాంతికి ముఖ్యమంత్రి గారు నారవారిపల్లికి వచ్చినప్పుడు నేను ఆయనను కలిసి నా సమస్యను తెలియజేయగా ఆయన తక్షణమే నాకు ఆర్థిక సహాయం క్రింది 3లక్షలు మంజూరు చేసారు. మాకు అండగా ఉంటూ సహాయం చేసి ఆదుకున్న ముఖ్యమంత్రి గారికి నా కృతజ్ఞతలు. నా పేరు ఆర్. రాధా కృష్ణయ్య, మాది తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ. నేను క్యాన్సర్ సమస్యతో భాధ పడుతున్నాను. ఆసుపత్రి చికిత్స మరియు మందులకు చాల ఖర్చు అవుతుంది. నా సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ క్రింద 5లక్షలు మంజూరు చేసారు. మాకు ఆర్థిక సహాయం చేసి ఆదుకుని అండగా ఉన్నందుకు ముఖ్యమంత్రి గారికి మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. చంద్రగిరి మండలం, కందులవారిపల్లి గ్రామానికి చెందిన వాసుదేవనాయుడు మాట్లాడుతూ నాకు బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ చేసియున్నారు. సర్జరీకి చాలా ఖర్చు అయింది. ఆర్థిక పరంగా ఇబ్బందులు పడుతున్నాము. రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కలిసి మా సమస్యను ఆయనకు విన్నవించుకోగా ఆయన తక్షణమే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ క్రింద 4 లక్షలు మంజూరు చేసారు. ఆర్థికంగా ఆదుకున్న ముఖ్యమంత్రికి నా కృతజ్ఞతలు. నా పేరు శారద మాది చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ కందులవారిపల్లి గ్రామం నా భర్త సుబ్రహ్మణ్యం లివర్ కాన్సర్ తో భాదపడుతున్నారు. రోజు కూలీ పనులు చేసుకునే పేదవారమైనందున ఆసుపత్రి ఖర్చులకు, మందులకు డబ్బులు సరిపోనందున ముఖ్య మంత్రి గారి సహాయార్థం ఆయనకు మా సమస్యను విన్నవించుకున్నాము, వారు వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ క్రింద మాకు ఆర్థిక సహాయంగా 4 లక్షలు మంజూరు చేసారు. ఆయన మేలు ఎన్నటికీ మర్చిపోలేము. చంద్రగిరి మండలం కందులవారిపల్లె గ్రామానికి చెందిన దామోదర్ నాయుడు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నానని ముఖ్యమంత్రి గారిని కలిసి వివరించగా వారు వెంటనే స్పందించి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. చంద్రగిరి మండలం, మామండూరు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి మాట్లాడుతూ నా కుమారుడు గుణశేఖర్ నాయుడుకి ప్రమాదం జరిగి తలకు దెబ్బ తగిలి బ్రెయిన్ సర్జరీ చేసారు. కుమారుడు పూర్తి పడకపైనే ఉండడం వలన ఎలాంటి ఆదాయం లేదు. మాకు వయసు పైబడిందని, కుటుంబ పోషణ, ఆసుపత్రి ఖర్చులు భరించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, ముఖ్యమంత్రి నారావారిపల్లి పర్యటన సందర్భంగా ఆయనను కలిసి మా పరిస్థితి తెలపగా ఆయన తక్షణమే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 2 లక్షలు మంజూరు చేసారు. మమ్మల్ని ఆదుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. నా పేరు మనోరంజని, మాది చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, కమ్మపల్లి గ్రామం నేను గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆసుపత్రి ఖర్చులకు, మందులకు ఇబ్బందిగా ఉన్నందు ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాము ఆయన తక్షణమే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.3.5 లక్షలు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి గారికి మా ధన్యవాదాలు. నా పేరు వి. అరుణ, మాది దొరవారి సత్రం మండలం పూల తోట గ్రామం, నా భర్త వి.రమేష్ అనారోగ్యంతో మరణించారు. ఆసుపత్రికి దాదావు 25లక్షలు ఖర్చు అయిందని, ఆర్థికంగా చాలా చితికిపోయాము. కుటుంబ పోషణ కూడా చాలా ఇబ్బందిగా ఉన్నదని మా సమస్యను ముఖ్యమంత్రి గారికి తెలియజేయగా వారు వెంటనే స్పందించి మెడికల్ బిల్లు రీయంబర్స్మెంట్ ద్వారా 5 లక్షలు మంజూరు చేసారు. సహాయం చేసి మమ్మల్ని ఆదుకుని ఆపన్న హస్తం అందించిన ముఖ్యమంత్రి గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము.

## కొత్త ఏడాదిలో కేంద్రం నుంచి అన్నీ మంచి వార్తలే



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,500 కోట్ల భారీ ప్యాకేజి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, విశాఖపట్నంలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసం వద్ద టీడీపీ కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. గంటా శ్రీనివాసరావు స్పందిస్తూ... కొత్త ఏడాదిలో కేంద్రం నుంచి అన్నీ మంచి వార్తలే వస్తున్నాయని వెల్లడించారు. నగరాభివృద్ధికి రూ.2 లక్షల కోట్ల పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారని, ఇప్పుడు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం రూ.11,500 కోట్లు కేటాయిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడంలో విజయం సాధించామని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వద్దంటూ గతంలో రాజీనామా కూడా చేశానని గంటా శ్రీనివాసరావు గుర్తు చేశారు. జగన్ ఐదేళ్ల పాలనతో రాష్ట్రం తీవ్రంగా అప్పులపాలైందని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకెళుతోందని వ్యాఖ్యానించారు.

## కుష్ఠు వ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 20 తేదీ నుండి ఫిబ్రవరి 2 వరకు జరిగే రెండవ సారి లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (గ్రా)లో ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రజా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమం సంచాలకులు డాక్టర్ కే పద్మావతి తెలిపారు. ఈ కార్యాక్రమంలో అర్బన్ ఏరియా , గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరిని ఆశా మరియు ఏఎన్ ఎం పరీక్షించి అనుమానిత కేసులను దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారికి పరిక్ష నిమిత్తం రెఫర్ చేయాలన్నారు. శరీరం పై స్పర్శ లేని రంగు మారిన మచ్చలు , కళ్ళు, కాళ్ళు చేతులు అంగ వైకల్యం ఉన్నచో ఆశా మరియు ఏఎన్ ఎం దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేసి వైద్య అధికారి నిర్ధారణ తరువాత్ర్రా మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. మొదటి మచ్చ రూపంలో ముందుగా గుర్తించగలిగితే కుష్ఠు వ్యాధి పూర్తిగా నయం అవడమే కాకుండా , అంగవైకల్యం రాకుండా అరికట్టవచ్చే విషయాన్ని కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికి చేరేలా, అలాగే ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లను ప్రదర్శించే విధంగా ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

సూర్య 18వ వసంతంలోకి...

visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శనివారం | 18 జనవరి 2025 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 87

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, పుష్యమి మాసం పుష్య బ.పంచమి పూర్తి, పుబ్బ మ.3.11, వర్జ్యం రా.11.02 నుంచి 12.47 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.03 వరకు

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు



5 లో

- అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న ఐటీ, బ్యాంకింగ్ సూచీలు
- 423 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 108 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

## క్రిప్టో కరెన్సీకి సానుకూలం



6 లో

అమెరికా తదుపరి అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో క్రిప్టోకరెన్సీ బిట్కాయిన్ జోరు మీదుంది. క్రిప్టోకరెన్సీ కి అనుకూలంగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు ఉండొచ్చన్న అంచనాలతో దీని విలువ రికార్డు స్థాయిలో పెరుగుతోంది.

- జాతీయస్థాయి ప్రాధాన్యం ఇచ్చే యోచనలో ట్రంప్
- ప్రమాణస్వీకారం అనంతరం ఊతమిచ్చేలా ఉత్తర్వులు జారీ
- విధివిధానాల నిమిత్తం క్రిప్టో కరెన్సీ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటుకు సంకేతం
- అంతర్జాతీయ మీడియా కథనంతో సర్వత్రా సంచలనం

## రాష్ట్ర ఆదాయంపై క్యాబినెట్‌లో చర్చ

- 62 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 63 అన్నా క్యాంటీన్‌ల ఏర్పాటు
- తాడేపల్లి పరిధిలోని పల్లపు ప్రాంతాలకు వరద నివారణ గోడ నిర్మాణం
- జనాభాను పరిగణనలోకి తీసుకుని సచివాలయాలు, ఉద్యోగుల కేటాయింపులు
- రీ సర్వేపై నిర్ణయం
- ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతం కావాలని సభ్యుల శుభాకాంక్షలు

శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృాద్ధికి సంబంధించిన పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా వ్యవసాయం, సహకార అంగాలకు సంబంధించిన అంశాలపై తీసుకున్న నిర్ణయాలు ఆ రంగాలకు ఎంతో చేదోడువాదోడుగా నిలుస్తాయి. ఇంకా అమరావతి, పోలవరం నిర్మాణం, గత ప్రభుత్వంలో జరిగిన నష్టాలను సరి చేసేందుకు మరి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.



2 లో

## ప్రజల సంక్షేమం కోసమే పథకాలు



- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి
- దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో జరగాలి
- మంత్రి సీతక్క

వివరాలు-7లో

## పెట్టుబడులకు భారత్ స్వర్గధామం

### అత్యుత్తమ గమ్యస్థానంగా నిలవటం ఖాయం

- భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025ను ప్రారంభించిన మోడీ
- మేక్ ఇన్ ఇండియాతో దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధి
- దేశ వ్యాప్తంగా 16 లక్షలకుపైగా ఎలక్ట్రిక్ బస్సులు
- ఈవీల ప్రోత్సహానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు



6 లో

దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని అన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృాద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు.

## ఢిల్లీ ఎన్నికలలో బిజేపి ఫ్రీ స్కీమ్స్



- మేనిఫెస్టో విడుదల చేసిన జేపీ నడ్డా
- బీజేపీ గెలిస్తే మహిళలకు నెలకు ఫ్రీగా రూ.2,500
- గ్యాస్ సిలిండర్ రూ.500,
- రూ.5లకే భోజన పథకం

వివరాలు-6లో


సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్


## తొలి రోజునే కీలక ఒప్పందాలు

- స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు సింగపూర్ అంగీకారం
- భాగస్వామ్యం కోసం ముందుకొచ్చిన సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్
- సీఎం సమక్షంలో ఒప్పందంపై సంతకాలు

ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు తొలిరోజునే విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా తెలంగాణ రైజింగ్ టీమ్ శుక్రవారం సింగపూర్ లో పర్యటించింది. సీఎం రేవంత్ రెడ్డి వెంట ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్ వీ ఎస్ఎస్ సుబ్బారావు ఈ టీమ్లో ఉన్నారు.



3 లో

### ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం
## నిధులు ఖర్చు చేయాలి

- శాఖల వారీగా ప్రతినెలా ఖర్చు వివరాలు వెల్లడించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



7 లో

### నీటి వాటాల పాపం
## బీఆర్ఎస్‌దే



7 లో

- పదేండ్ల పాటు తెలంగాణకు తీరని ద్రోహం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

కృష్ణా జలాలను పదేండ్లుగా పట్టించుకోని బీఆర్ఎస్ లీడర్లు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు. కృష్ణా జలాల నదీ వివాదానికి సంబంధించి తెలంగాణలో ఉన్న పరివాహక ప్రాంతం, ఆయకట్టు ఆధారంగా వాటాలు పెరగాలని కాంగ్రెస్ పార్టీ తొలినుంచి పోరాటం చేస్తూ వస్తోంది.

### ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో
## ఉంచడం ఏమిటి?


- విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన విచారణలు వేగవంతం చేయాలి
- ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి వివరాలేమిటో నివేదిక సిద్ధం చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

ఉద్యోగుల పనితీరు మీద సున్నితమైన విజిలెన్స్ ఉండాలి. వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉద్యోగుల నిజాయతీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శనిలా పని చేస్తుంది.



2 లో

## అంతా ఇంతే!




సీఎంగారు వచ్చే లోపు ఇక్కడ కేటీఆర్‌ను ఎత్తేద్దామా సార్

### ఏపీతో పని చేయడానికి
## సిద్ధం



2 లో

- ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తాం
- స్వర్ణాంధ్ర-2047 సాధనకు తోడ్పడతాం
- మా సేవలు వినియోగించుకోండి
- ఆర్టీజీఎస్ ప్రభుత్వ అధికారులతో సమావేశం

### బీసీల హక్కుల సాధనకై
## ఆమరణ దీక్ష చేస్తా

- నాతో పాటు బీసీలు సిద్ధపడాలి
- బీసీలది ఇక మహా ఉద్యమమే
- తెగించి పోరాటం చేసేందుకు సమయం ఆసన్నమైంది
- రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పల్లెను గెలుద్దాం, ఢిల్లీని ఎలుదాం
- ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో మేధావుల సదస్సు
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



6 లో

### విశాఖ స్టీల్ కార్మికుల
## సంబరాలు



- కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ
- ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి ధన్యవాదాలు

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం శుభవార్త చెప్పింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు.

### ఫిబ్రవరి 1న
## కేంద్ర బడ్జెట్

- బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు
- సామాన్యుల్లో, వేతన జీవుల్లో భారీ అంచనాలు
- ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ వసూళ్లు పెరిగి, ఖజానాకు పెద్ద మొత్తంలో రాబడి

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 నుంచి జరిగే అవకాశముంది. తొలిరోజున పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. రెండు విడతలు జరిగే ఈ సమావేశాలు తొలుత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి.



6 లో

ఈ మధ్యకాలంలో భారతీయ కార్పొరేట్ ప్రముఖులు చేసిన కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు, దేశంలోని కార్మిక, ఉద్యోగ వర్గాల సాంఘిక జీవితం, వ్యక్తిగత గౌరవం, హక్కులపై గంభీరమైన దాడిని సూచిస్తున్నాయి. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, ఓలా %జజూ% భవిష్ అగర్వాల్, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ, %ూడు% చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం లాంటి ప్రముఖులు తమ వ్యాఖ్యలతో ఒక విధంగా శ్రామికవర్గ సాంఘిక జీవనశైలిని అవమానిస్తూ, వారి పనిగంటలు పెంచాలని, సాంఘిక జీవనానికి విలువ లేదని చెప్పే ప్రయత్నం చేశారు. మనిషి ఒక సంఘజీవి. కుటుంబం, సమాజం, సంబంధాలు, స్నేహాలు, పీడిత పరిస్థితుల్లో కలిసి జీవించడం అనేవి ఈ సామాజిక వ్యవస్థకు అత్యంత కీలకం. శ్రామిక వర్గం ప్రతిరోజూ జీవితాన్ని ముందుకు నడిపించడానికి చెమటోడ్చి, శ్రమించి జీవనాధారాన్ని ఏర్పరుస్తుంది. ఈ క్రమంలో వారు తమ కుటుంబాలతో గడిపే సమయం, ఇరుగు పొరుగు వారితో మమేకం, పిల్లలతో ఆటలు, బంధువులతో పంచుకునే భావోద్వేగాలు, ఇవి అన్ని వారి జీవితాల్లో అంతర్భాగాలుగా ఉంటాయి. ఈ విధంగా కష్టజీవుల సాంఘిక జీవితం అనేది వారిలో మానసిక శాంతి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. కానీ, కార్పొరేట్ వర్గం మాత్రం ఈ సాంఘిక జీవనాన్ని అర్థం చేసుకోవడం లేదని, ఇంకా అది అవసరమే కాదని చెప్పే స్థాయికి దిగజారింది. నారాయణమూర్తి గారు "ఉద్యోగులు వారానికి 70 గంటలు పని చేయాలి" అంటూ చేసిన వ్యాఖ్యలు కార్పొరేట్ జాతి పని మనుగడను పెంచడానికి తమ ప్రతిష్టను పునరుద్ధరించే ఆరాటంగా కనిపిస్తోంది. కానీ, ఆ పని గంటలు పెంచడం ద్వారా శ్రామిక వర్గాలకు కలిగే మానసిక, శారీరక భారాన్ని అసలు పరిగణించడమే లేదు. ఆ వ్యాఖ్యలు శ్రామిక జీవన విధానానికి, వారి కుటుంబ సంబంధాలకు అవమానకరంగా ఉన్నాయి.
గౌతమ్ అదానీ గారు "ఇళ్లలో ఎక్కువ సమయం గడిపితే భార్యలు భర్తలను విడిచిపోతారు"

## కార్పొరేట్ పొగరుబోతుతనం

అన్న తన వ్యాఖ్యతో స్త్రీల గౌరవాన్ని కించపరిచాడు. ఒక వ్యక్తి కుటుంబ జీవనాన్ని చులకనగా చూసి, దానిని తమ లాభాల కోసం నీచ రాజకీయాలకు వాడుకోవడం అనాగరికతకు పరాకాష్ఠ. ఇలాంటి వ్యాఖ్యలు మాత్రమే కాకుండా, కార్మిక వర్గాల వ్యక్తిత్వాన్ని హేళన చేయడం వారి అంతరంగంలో ఉన్న గౌరవ లేమిని బయటపెడుతుంది. %ూడు% చైర్మన్ సుబ్రహ్మణ్యం గారు "వారానికి 90 గంటలు పని చేసి భారత్ను అగ్రరాజ్యంగా మార్చాల" అనే వాదన, కేవలం తమ వ్యాపార లక్ష్యాలను మించిపోయింది. శ్రామికుల జీవితాలను నాశనం చేసే మూర మైన ఆలోచనల సూచన.
శ్రామికవర్గం అనేది దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వారి శ్రమ వల్లనే దేశంలోని అన్ని వర్గాల మనుగడ సాధ్యమవుతోంది. కార్పొరేట్ సంస్థలు, తమ ఆస్తులు, లాభాలు శ్రామికుల చెమట, నెత్తురు, కష్టాలతోనే ఏర్పడినవి. ఈ నేపథ్యంలో శ్రామిక వర్గం మీద వీరు హేళన చేయడం పూర్తిగా తగదు. కార్పొరేట్ సంస్థల లక్ష్యం డబ్బు సంపాదన మాత్రమే. కానీ, శ్రామిక వర్గం డబ్బుతో పాటు తమ కుటుంబాలను, సమాజాన్ని, భావోద్వేగాలను మిక్స్ చేసుకున్న జీవితం గడపగలుగుతుంది. ఇది వాళ్ల సామాజిక జీవనానికి ప్రతిబింబం. సమాజంలో మానవ హక్కులకు అనుగుణంగా ప్రతి వ్యక్తికి విశ్రాంతి, కుటుంబంతో గడిపే సమయం, వ్యక్తిగత జీవితం అనే హక్కులు ఉంటాయి. కానీ కార్పొరేట్ అధిపతుల వ్యాఖ్యలు వారిని యంత్రాలుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయి. 12 గంటల పని దినం, వారానికి 70 లేదా 90 గంటల పని డిమాండ్లు శ్రామికవర్గాన్ని మానసిక, శారీరక అరాచకానికి గురిచేస్తాయి. ఇది కేవలం వ్యక్తుల జీవితాలనే కాక, దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదాన్ని తెస్తుంది.
ఇలాంటి పరిస్థితుల్లో శ్రామికవర్గం మౌనంగా ఉండడం అత్యంత ప్రమాదకరం. ఈ వ్యాఖ్యలు ఒక దుష్ట వ్యూహం కావచ్చు. కార్పొరేట్ వర్గాలు మోడీ ప్రభుత్వ అండతో లేబర్ కోడ్స్, పని గంటల పెంపు వంటి నిబంధనలు ప్రయోగించడానికి ప్రయత్నిస్తున్నాయి. శ్రామికవర్గం ఉద్యమం ముందుకు రావాలి. ఈ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గొప్ప నిరసనోద్యమాలను రూపొందించాలి. శ్రామిక సంఘాలు, రైతు సంఘాలు, దళిత, బహుజన వర్గాల మద్దతుతో కార్పొరేట్ మూకల దుష్ట విధానాలకు గట్టి సమాధానం చెప్పాలి.పని గంటల తగ్గింపు అనేది ప్రత్యేకంగా పరిశ్రమల అభివృద్ధి, కార్మికుల హక్కుల కోసం పోరాటాలు, ప్రభుత్వ పాలనలో మార్పుల ఆధారంగా చోటు చేసుకుంది. ఇందుకు ముఖ్యమైన కొన్ని ఘట్టాలు వున్నాయి. పారిశ్రామిక విప్లవం (18వ శతాబ్దం చివర) సమయంలో కార్మికులు ఎక్కువగా 12–16 గంటలపాటు పని చేసేవారు. అయితే, అసహనాలు, ఆరోగ్య సమస్యల వల్ల పని గంటల తగ్గింపు అవసరం అనిపించింది. ఫ్యాక్టరీ చట్టాలు, 19వ శతాబ్దంలో వచ్చాయి. బ్రిటన్, యూరప్ వంటి దేశాలలో పలు చట్టాలు అమలులోకి వచ్చాయి. 1847లో, బ్రిటన్లో "%ువఅ ఄశీబతీం-ూాష%" చట్టం ద్వారా పని గంటలు 10 గంటలకు పరిమితం చేశారు.
అమెరికా, 20వ శతాబ్దంలో 1914లో, హెన్రీ ఫోర్డ్ కంపెనీ తొలిసారిగా 8 గంటల పని సమయాన్ని ప్రవేశపెట్టింది. అదే సమయంలో ఆదాయాన్ని పెంచింది. ఈ మార్పు తరువాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఎగువ ముఖం పట్టింది. 1886లో, మే డే సందర్భంగా అమెరికాలో కార్మికులు 8 గంటల పని సమయం కోసం భారీ ప్రదర్శనలు చేశారు. ఇది కార్మికుల హక్కుల చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (%ఎూూ%) 1919లో, %ఎూూ% పని గంటలను 8 గంటలకు పరిమితం చేయాలని సిఫారసు చేసింది, ఇది అంతర్జాతీయంగా ఆమోదించబడింది.
భారతదేశంలో 1948లో ఫ్యాక్టరీ చట్టం ద్వారా పని గంటలను 8 గంటలకు పరిమితం చేశారు. అలాగే, కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని చట్టాలు అమలు చేశారు. ఈ మార్పులు కార్మికుల ఆరోగ్యం, సమతుల్య జీవనశైలికి దోహదపడినట్లు చెప్పవచ్చు.
కార్మికులు, ఉద్యోగులు కేవలం డబ్బు సంపాదించే యంత్రాలు కాదు. వారికి తమ సాంఘిక జీవనం కూడా చాలా ముఖ్యమైనది. పెరుగుతున్న కార్పొరేట్ ధోరణులకు వ్యతిరేకంగా, శ్రామిక వర్గం జాగ్రత్తగా వ్యవహరించాలి. వారి హక్కులను కాపాడుతూ, మానవ సంబంధాలను, జీవన విలువలను అర్థం చేసుకునే విధంగా సమరశీల పోరాటాలకు నడుం కట్టాలి. శ్రామిక వర్గం శక్తి సామాజిక జీవనానికి ఆర్థిక దిశనిచ్చే శక్తి. ఆ శక్తిని ఎవ్వరూ దెబ్బతీయలేరు.

# హమాస్, ఇజ్రాయెల్ శాంతి ఒప్పందానికి అడ్డంకిగా అంతర్గత విభేదాలు

- ఖతార్ ప్రధాని హమాస్, ఇజ్రాయెల్ ప్రతినిధులతో చర్చలు
- వివాదం సద్దుమనిగినట్టేనని ఇరు దేశాల ప్రకటన
- ఇరు దేశాలలో బందీలను విడుదల చేసేందుకు అంగీకారం
- కాల్పుల విరమణ మావల్లే నంటూ ప్రకటించుకున్న బైడెన్ ట్రంప్ లు
- శాంతి ఒప్పందం మంచిదే కానీ దీని దీర్ఘకాలిక ప్రభావం ఏమిటో అర్థకావటంలేదు



బి.వి. రమణ
94407 40015

ప్రస్తుతం ఇజ్రాయెల్–హమాస్ మధ్య శాంతి ఒప్పందంతో ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదం ముగిసిందని చెప్పడం అసాధ్యం. బందీల విడుదల తర్వాత కొత్త సమస్యలు తలెత్తవచ్చు. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేసిన తరువాత గాజా ప్రాంతంలో పునర్నిర్మాణం ప్రారంభం అవుతుంది. కానీ గాజా ప్రజలను వారి మునుపటి గృహాల్లో ఉంచడం కొత్త సమస్య మారవచ్చు. ఇజ్రాయెల్ దాడుల్లో ప్రజలు తమ ఇళ్లను కోల్పోయారు. వారి ఆస్తులు పునర్నిర్మాణానికి ముందు అక్కడ కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ.. చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ ప్రధాని హమాస్, ఇజ్రాయెల్ ప్రతినిధులతో విడివిడిగా సమావేశమయ్యారని, కొద్దిసేపటికే వివాదం సద్దుమణిగిందని ఖతార్ అధికారి ప్రముఖ వార్త సంస్థ రాయిటర్స్ కు తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇజ్రాయెల్ – హమాస్ మధ్య 15 నెలల సుదీర్ఘ సంఘర్షణకు ముగింపు పలికింది.గాజా ప్రజలకు తాత్కాలిక ఉపశమనం. గత 15 నెలలుగా ఎడతెరపి లేకుండా జరిగిన దాడులు.. గాజా ప్రజలకు ఎప్పటికీ చేదు జ్ఞాపకాలు. ముఖ్యంగా హమాస్ చేతు ల్లో బందీగా ఉన్న 250 మంది ఇజ్రాయెల్ వాసుల్లో దాదాపు 100 మందికి ఈ శాంతి ఒప్పందం స్వేచ్ఛను కల్పిస్తుంది. ఇది ఒక శుభ పరిణామం. అక్టోబరు 2023లో ఇజ్రాయెల్పై హమాస్ దాడి చేయడంతో ఏర్పడిన యుద్ధానికి ముగింపు పలికేందుకు గత ఏడాది యుఎస్, ఈజిప్ట్ – ఖతార్ మధ్యవర్తిత్వం వహించాయి. నెలల తరబడి జరిగిన చర్చల సమయంలో, చివరి నిమిషంలో రోడ్బ్లాక్లను కొట్టేందుకు మాత్రమే తాము కాల్పుల విరమణకు దగ్గరగా ఉన్నామని ఇరుపక్షాలు గతంలో చెప్పాయి.
అక్టోబరు 7, 2023న ఇజ్రాయెల్పై హమాస్ అత్యంత ఘోరమైన దాడిని ప్రారంభించిన తర్వాత గాజాపై యుద్ధం ప్రారంభమైంది. దీని ఫలితంగా 1,210 మంది మరణించారు.ఎక్కువగా పౌరులు, %ూాఫీ% లెక్క ప్రకారం. దాడి సమయంలో హమాస్ ఇజ్రాయెల్ నుండి 251 మంది బందీలను కూడా తీసుకుంది. వీరిలో 94 మంది ఇప్పటికీ గాజాలో ఉన్నారు. వీరిలో 34 మంది మరణించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 46వేల మందికి పైగా గాజా ప్రజలు మరణించారు. దాదాపు గాజా ప్రాంతం పూర్తిగా నాశనమైంది. ఇలాంటి పరిస్థితుల్లో కాల్పుల విరమణ ఒక సానుకూలమైన పరిణామం. అయితే శాంతి సాధ్యమేనా అన్న దానిపై ఇంకా స్పష్టత లేదు.
ఇజ్రాయెల్ గాజాపై దాడులను తాత్కాలికంగా నిలిపివేయడానికి ఒప్పుకుంది. దీనికి ప్రతిగా హమాస్ తన బందీలను విడిచిపెట్టే యత్నం చేస్తోంది. 2023 అక్టోబర్ 7న హమాస్ చేసిన ఆకస్మిక దాడిలో 251 మంది ఇజ్రాయెల్ వారిని బంధించారు. ఈ దాడిలో 1,200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు, సైనికులు మరణించారు. ఇక గత కొన్ని వారాలుగా ఎడతెగక సాగిన చర్చలు, దఫ దఫాలుగా బందీల విడుదలకు హమాస్ అంగీకరించడం, తమ కారాగారాల్లో మగ్గుతున్న వందలమంది పాలస్తీనియన్లను విడిచిపెట్టేందుకు ఇజ్రాయెల్ తలూపడం వంటి పరిణామాలు ఒప్పందం కుదిరేందుకు దోహదం చేశాయి.
మొదటి దశ లో ఇది ఆరు వారాలు కొనసాగుతుంది. ఇందులో ఇజ్రాయెల్–హమాస్ బలగాలు పూర్తిస్థాయిలో కాల్పుల విరమణను పాటించాలి. గాజాలోని జనాలు ఉండే ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనుదిరగాలి. వందల మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయాలి. ప్రతిగా మహిళలు, వృద్ధులు సహా పలువురు బందీలను హమాస్ అప్పగించాలి.
రెండో దశ లో సైనికులు సహా సజీవ ఇజ్రాయెలీ బందీలందరినీ హమాస్ విడిచిపెట్టాలి. గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలు పూర్తిగా వెనక్కి వచ్చేయాలి.
మూడో దశలో గాజాలో పునర్నిర్మాణ పనులు భారీస్థాయిలో ప్రారంభమ వుతాయి. బందీలుగా ఉన్నప్పుడు ప్రాణాలు కోల్పోయినవారి అవశేషాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలి.
అయితే.. బైడెన్ ప్రతిపాదించిన ఒప్పంద సూత్రాలకే ఇరు వర్గాలు అంగీకరించాయా? లేదంటే అందులో ఏమైనా మార్పులు జరి గాయా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. మధ్యవర్తులు చెబుతున్న సమాచారం ప్రకారం.. తొలిదశలో యుద్ధం నిలిపివేతపై చర్చలను ప్రారం భించడంతో పాటు, 6వారాల పాటు కాల్పుల విరమణ పాటించాలి. హమాస్ చెరలో బందీలుగా ఉన్న సుమారు 100 మందిలో 33 మందిని ఈ సమయంలో విడిచిపెట్టాలి" అని ఉన్నట్లు తెలుస్తోంది.
హమాస్ దాడిని ఆధారం చేసుకుని.. ఇజ్రాయెల్ గాజాను పూర్తిగా దెబ్బతీయడం ప్రారంభించింది. ప్రజలను గాజా నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేసింది. ఈ చర్యలను ప్రపంచంలో కొన్ని వర్గాలు "జెనోసైడ్"గా అభివర్ణించాయి. అంతర్జాతీయ న్యాయసభ (%×జజీ%) ఈ అంశంపై దృష్టి సారించింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య జరుగుతున్న తాజా ఒప్పందం శాశ్వత శాంతిని అందించగలదా? గాజా పునర్నిర్మాణం ఎలా జరుగుతుంది? ఇజ్రాయెల్–పాలస్తీనా విభేదాలపై దీని ప్రభావం ఏమిటి? ఇవి తేలికగా చెప్పే సమాధానాలు కావు.
ప్రస్తుత కాల్పుల విరమణ వల్ల గాజా ప్రజలు కొంత తాత్కాలిక ఉపశమనం పొందొచ్చు. గాజాలోని నివాస ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ సైనికులు వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంది. అనారోగ్యంతో ఉన్న గాజా ప్రజలు మెడికల్ ట్రీట్మెంట్ కోసం ఈజిప్టుకు వెళ్లడానికి అనుమతి పొందవచ్చు. కానీ దీని తర్వాతి పరిణామాలపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.
హమాస్ అక్టోబర్ 7న దాడి చేయడం.. ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదం.. దశాబ్దాల చరిత్రలో మరో ఘట్టం మాత్రమే. 1967 నుంచి గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలు ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉన్నాయి. యునైటెడ్ నేషన్స్ ద్విరాష్ట్ర ప్రణాళిక ప్రకారం పాలస్తీనాకు హక్కులు ఇచ్చినా, ఇజ్రాయెల్ తన పట్టు బిగించింది.
పాలస్తీనా రాష్ట్రం కోసం నిర్దేశించిన భూముల్లో ఇజ్రాయెల్ చట్ట విరుద్ధంగా స్థావరాలను నిర్మించింది. ఇవి సాధారణ నివాస గృహాల్లా కాకుండా అభివృద్ధి చెందిన పట్టణాలుగా తయారయ్యాయి. అవి పునరావాసానికి దాదాపు శాశ్వతంగా మారాయి.
ఇజ్రాయెల్ గాజాను నాశనం చేసిన తర్వాత భవిష్యత్తులో పునర్నిర్మాణం జరిగితే అక్కడ పాలస్తీనా ప్రజలను కాకుండా.. జ్యూయిష్ ప్రజ లను ఉంచే అవకాశం ఉంది. గతంలో కూడా ఇజ్రాయెల్ ఇలాంటి అవకాశాలను ఇజ్రాయెల్ వదులుకోలేదు.
ప్రస్తుతం ఇజ్రాయెల్–హమాస్ మధ్య శాంతి ఒప్పందం ఉందని చెప్పుకున్నా.. ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదం ముగిసిందని చెప్పడం అసాధ్యం. ఈ పరిణామం తాత్కాలిక దశ మాత్రమే. భవిష్యత్తులో బందీల విడుదలతర్వాతపునర్నిర్మాణంలోకొత్త సమస్యలు తలెత్తవచ్చు. ఏ చిన్న తప్పు శాంతి ఒప్పందాన్ని పాడు చేసే ప్రమాదం ఉంది.
గాజా పరిస్థితులు ఇంకా అనిశ్చితంగా ఉన్నాయి. శాంతి ఒప్పందం మంచిదే కానీ దీని దీర్ఘకాలిక ప్రభావం ఏమిటో ఇప్పటికీ స్పష్టత లేదు. గాజాలో కొత్త సమస్యలు ఎప్పుడు మొదలవుతాయో చెప్పడం కష్టం. అందుకే భవిష్యత్ పరిణామాలను సానుకూలంగా ఎదుర్కోవడమే ఉత్తమం.
ఇజ్రాయెల్–హమాస్ మధ్య శాంతి ఒప్పందం ఓ కొలిక్కి రావడంపై అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బంధీలను విడిచిపెట్టడంతో పాటు కాల్పుల విమరణ ఒప్పందానికి సిద్ధపడడంతో ఇరువర్గాలను ట్రంప్ మెచ్చుకున్నారు. అయితే.. మరో ఐదు రోజుల్లో ఆయన వైట్హౌస్లో అడుగుపెట్టబోతున్న సంగతి తెలిసింది. ఈలోపే గాజా యుద్ధం ముగింపు దిశగా అడుగు పడడాన్ని ఆయన తన విజయంగా అభివర్ణించుకుంటున్నారు.

# వారసత్వ సంపద పరిరక్షణ మరచిన ప్రభుత్వం

డాక్టర్. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

- దేవాలయాలకు ఆధ్యాత్మిక శోభ సరే సంస్కృతి ప్రదేశాలు పరిరక్షణేది ?
- చరిత్రపూర్వ మానవుని జీవన శైలిని చిత్రీకరన శిల్పాలు
- వాటిని ఛిద్రం చేసిన పట్టించుకుని అధికారులు
- ప్రాచీన శిలాయుగం నాటి శిల్పాలకు కనెక్టివిటీ బాధ్యత తీసుకోవాలి
- పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది

ఒకవైపు పుష్కరాలు కుంభమేళా దేవాలయాల పేరుతో లక్షల కోట్లు వెచ్చించి అజ్ఞానాన్ని మూఢభక్తి ని అవివేకాన్ని పెంచి పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వం మరోవైపు ఆంధ్రలో ఉన్న అన్ని దేవాలయాలకు రాబోయే రెండు సంవత్సరాలలో ఆధ్యాత్మిక శోభ తెస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి, తల్లికి తిండి పెట్టలేదు కానీ పిన్నమ్మకు బంగారు గాజులు కొనిచ్చినట్లు ఉంది ప్రభుత్వాల తీరు. క్రీస్తు పూర్వం 10000 నుండి 6000 మధ్య చారిత్రక శిలా శాసనాలు రాయలసీమ జిల్లాలలో నిర్లక్ష్యం చేయబడి నేడు ఆకతాయి చేష్టలకు మసక బారుతున్నాయి. చాలా ప్రదేశాలలో సంరక్షణ లేక వెలకట్ట లేని సంపద వృధాగా మారుతున్నది. ఆదిమ మానవుడు గీసిన చిత్రాలు, శిలాశాసనాలపై ఈ మధ్యకాలంలో ఆకతాయిలు బొగ్గుతో పదునైన వస్తువుతో రాతలు వ్రాసారు ఛిద్రం చేసిన పట్టించుకునే వారే లేరు. ఓర్వకల్ మండలం కేతవరం వద్ద ఉన్న ఈ గుహలు పురాతన శిలాయుగానికి చెందిన రాతి కళకు నిలయం. జింకలు, ఎద్దులు, నక్కలు, కుందేళ్ళు మరియు మానవుల చిత్రాలను గుహలలోని పురాతన నివాసులు రూపొందించిన చిత్రాలు కొంతకాలంగా స్థానికులలో బాగా ప్రాచుర్యం పొందాయి.
కేతవరం రాక్ పెయింటింగ్లు కేతవరంలోని రాక్ పెయింటింగ్లలో ఒక జంతువు యొక్క నేపథ్యాన్ని నొక్కి చెబుతాయి. చిత్రాల సమూహం చరిత్రపూర్వ మానవుని జీవన శైలిని చిత్రీకరించింది. బొమ్మలలో ప్రముఖంగా కనిపించే జంతువులు జింకలు, స్టాఫ్, జింక, హైనా, కుందేలు, సరీసృపాలు మరియు కప్ప.ఈ దశ యొక్క చారిత్రాత్మక చిత్రాలు ఒకే ఒక రాక్ షెల్టర్లో కనిపిస్తాయి, అవి పైటెండ్లను కలిగి ఉంటాయి. పెయింటింగ్లు 5000 సంవత్సరాలకు పైగా ప్రకృతి వైపరీత్యాల నుండి బయటపడినప్పటికీ, వాతావరణానికి భంగం కలిగించే మానవ కార్యకలాపాలు పెరగడంతో భవిష్యత్తులో అలా ఉండకపోవచ్చు. కేతవరం గుహలకు చారిత్రక సాంస్కృతిక ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, వాటికి ఇంకా యునెస్కో గుర్తింపు లభించకపోవడం సిగ్గుచేటు. కేతవరం రాతి చిత్రాలు ప్రాచీన శిలాయుగం నాటివి. అయితే, కనీస కనెక్టివిటీ లేదు, పర్యాటకంలో సమాచారం లేదు. గుహలకు వెళ్లేందుకు కొత్త రోడ్లు వేయాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అవెన్యూ ప్లాంటేషన్ జరిగితే చుట్టుపక్కల కొంత పచ్చదనం ఉంటుంది, పురావస్తు శాఖ ద్వారా పరిరక్షణ పనులు చూసుకుంటున్నట్లు నటిస్తున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు అధికారులు యునెస్కో ఆశ్రయించడం లేదు. కేతవరం గుహలు



ప్రధాన ఆకర్షణగా తీసుకుని స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు సరైన ప్రచారం లేదు. అశోకుని రాతి శాసనాలు 3వ శతాబ్దం లో చెక్కబడ్డాయి. శాసనం ప్రాకృత భాష, బ్రహ్మీ లిపిలో ఉంది. పెద్ద, చిన్న సవరణలు రెండూ ఎర్రగుడి లో కనిపిస్తాయి. ఈ ప్రదేశం ఆంధ్ర ప్రదేశ్–కర్ణాటక సరిహద్దుకు సమీపంలో, ద్వీపకల్ప భారతదేశంలో గ్రామీణ ప్రాంతంలో అనేక రాతి బండలతో కూడిన కొండను కలిగి ఉంది. శాసనాలు అనేక రాళ్లపై కనిపిస్తాయి, ఇవి ఎడమ నుండి కుడికి వ్రాయబడ్డాయి, సాధారణంగా రాతి సహజ వక్రతతో చుట్టబడి ఉంటాయి. కొన్ని దూరం నుండి స్పష్టంగా కనిపిస్తాయి. మరిన్ని సహజ కోత కారణంగా కొద్దిగా క్షీణించాయి వాటిని కనుగొనడానికి దగ్గర పరిశీలన అవసరం. ఉద్దేశపూర్వక నష్టం చేసిన దాఖలాలు కనిపించవు. భారతదేశంలో కనుగొనబడిన అత్యంత పురాతన శాసనాలు ఉన్నాయి. ఈ ప్రదేశం భారతీయ చట్టాల ప్రకారం పురావస్తు శాఖ రక్షిత ప్రదేశంగా ఉంది. బూదగవి అనంతపురం జిల్లా ఉరవకొండ టాక్లో ఉన్న ఒక చిన్న గ్రామం, అనంతపురం – బళ్లారి రహదారిలో ఉరవకొండ నుండి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాని ఫ్లాట్ టాప్ వాలులలో అనేక ప్రదేశాలలో ఉన్న గ్రానైట్ కొండ మోనోలిథిక్ నియోలిథిక్ టూల్స్ ఆధారాలను వెల్లడించింది. ఈ ప్రదేశాన్ని రాబర్ట్ బ్రూస్ ఫూట్ 18 వ శతాబ్దంలో కనుగొన్నారు. నియోలిథిక్ హాబిటేషన్ సైట్ ఇక్కడ ఎటువంటి త్రవ్వకాలను నిర్వహించలేదని భావించారు, నియోలిథిక్ కళాఖండాల కుండల మోనోలిథిక్ టూల్స్ పెద్ద ఉపరితల సేకరణ నివేదించబడింది. నాలుగు రాక్ షెల్టర్లలో మొత్తం రాక్ పెయింటింగ్ల సంఖ్య 20. రాక్ షెల్టర్ 2 తెలుపు రంగులో ఉన్నాయి. తెల్లని పెయింటింగ్స్లో రెండు మానవ బొమ్మలు ఒకటి ఫ్లాట్ వాష్లో మరొకటి అవుట్లైన్లో, పక్కపక్కనే నిలబడి ఉన్న భంగిమలో ఉన్నాయి. ఎరుపు రంగు ఓచర్లోని పెయింటింగ్లు జింక హంప్డ్ ఎద్దుల చేతిముద్రలను రేఖాగణిత బొమ్మలు మానవ బొమ్మలను వర్ణిస్తాయి. (స్థానిక ప్రజలు పెయింటింగ్స్ రథ పటాలు అని పిలుస్తారు) బుదగవి ఒక అందమైన రాక్ షెల్టర్ప్రపంచ వారసత్వ ప్రదేశాలు సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ లేదా ఇతర రకాల ప్రాముఖ్యత కోసం యునెస్కోచే నియమించబడ్డారు. ఒకసారి ఒక ప్రదేశం చెక్కబడితే, అటువంటి సైట్ల పరిరక్షణ కోసం కార్యకలాపాలకు మద్దతుగా ప్రపంచ వారసత్వ కమిటీ నుంచి దేశం ఆర్థిక సహాయం నిపుణుల సలహాలను కూడా పొందవచ్చు.నేడు అనంత ఖ్యాతి కలిగిన ఈ చారిత్రక సంపద పూర్తిగా ప్రమాదపు అంచున ఉన్నట్లుంది. రాయలసీమలో శిల్ప కళా సంపద, ఆదిమ మానవుడు రాతలు గీతలు ప్రభుత్వ పరిరక్షణ లేక, చరిత్రకారుల నిర్లక్ష్యం తోడై కనుమరుగవుతున్నది. ఎనిమిది సంవత్సరాల క్రిందట కృష్ణ సత్య విగ్రహం సలకం చెరువులో తస్కరించబడింది, రాయదుర్గంలో రాతి మంచం, హేమవతిలో మానవ ఆకారంలో శివుని విగ్రహం, కంబదూరు ఆలయంలో బ్రహ్మ కమలం, బుక్కపట్నంలో సతి, పెనుకొండలో వెలసిన ప్రశ్వనాథ్, రత్నగిరి కోట, తాడిపత్రి లో వెలసిన చింతల వెంకట రమణ స్వామి గుడి, ఏనుగు గుహలు, ఆదిమ మానవుడు గీసిన చిత్రాలు, కనగానపల్లి శాసనం, విడపనకల్లు, గోరంట్లలో వెలసిన దేవాలయాలు, కుందుర్పి లో సమాధుల మీద వెలసిన 30 అడుగుల బండలు. గుత్తి, పెనుకొండ, రత్నగిరి కోటలు ఇప్పటికీ చెక్కు చెదరక చూపరులను కనువిందు చేస్తున్నాయి కానీ వీటికి సంరక్షణ లేదు. లేపాక్షి, బుగ్గ రామలింగేశ్వర స్వామి గుడి, చింతల వెంకటరమణ స్వామి గుళ్లపై చెక్కిన అద్భుత శిలా సంపద. లేపాక్షి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రధాన శైవక్షేత్రం, పర్యాటక కేంద్రం. ఇరవై సంవత్సరాల కిందట ప్రారంభించిన బెలుం గుహలు గత సంవత్సరం ప్రారంభించిన వాల్మీకి గుహలు గుత్తి కోట ఇతర చారిత్రిక ప్రదేశాలకు టూరిజం సర్క్యూట్ ప్రణాళిక లేదు. యాక్సెసిబిలిటీ పరిరక్షణను మెరుగుపరచడానికి చేస్తున్న ప్రయత్నాల గురించి వినడం సంతోషాన్నిస్తుంది. ఆశాజనక, ఈ కార్యక్రమాలతో, గుహలు ప్రపంచ వారసత్వ ప్రదేశం గా మారడానికి అవసరమైన దృష్టిని పొందుతాయని, స్థానిక సమాజానికి గుర్తింపును మాత్రమే కాకుండా ఆర్థిక అవకాశాలను కూడా తీసుకువస్తుందని ఆశిద్దాం

# ఇంటర్ విద్యలో మార్పులు తేవాలి

ఇంటర్ విద్యలో సంస్కరణల అవసరజాతీయ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం భారతదేశంలో విద్యార్థుల ఆత్మహత్యల్లో 9% ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. వీటిలో మెజారిటీ విద్యార్థులు ఇంటర్మీ డియట్ చదువుతున్నవారే కావడం గమనార్హం. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్ (2022) ప్రకారం విద్యార్థుల ఆత్మ హత్యల్లో మహారాష్ట్ర తమిళనాడు, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉండగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ 10, 11వ స్థానంలోఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదువు తున్న విద్యార్థుల అధిక శాతం మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇంటర్మీడియట్ విద్యారంగం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో ఉండ డమే. వారి ప్రభావం మూలంగా గత మూడు దశాబ్దాలలో ఇంటర్మీడియట్ విద్యలో ఎటువంటి సంస్కరణలు జరుగలేదు. కార్పొరేట్ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం పోటీ ప్రపంచంలో తామంటే తాము ముందున్నా మని ప్రజలను నమ్మించడం కోసం విద్యార్థు లను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారుతెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి వరకు నిరంతర సమగ్ర మూల్యాంకనం (%జజజు%) విధానం, ఆంధ్రప్రదేశ్ లో సీబీఎస్ఈ పరీక్షల విధానం అమలులో ఉన్నాయి. పదో తరగతి సిలబస్, ఇంటర్మీడియట్ సిలబస్ మధ్య చాలా వైవిధ్యత ఉంటుంది. పదో తరగతి బోర్డు పరీక్షలలో ప్రశ్నపత్రం విధానానికి ఇంటర్మీడియట్ పరీక్ష ప్రశ్నపత్రం విధానా నికి కూడా మౌలికంగా చాలా తేడాలు ఉన్నవి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఆగస్టులో పూర్తి అవుతాయి. పరీక్షలు మార్చి మొదటి వారంలో ఉంటా యి. విద్యార్థి కేవలం 6 నెలల్లో సిద్ధం అయి బోర్డు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది.కొన్ని సందర్భాల్లో విద్యార్థులు మొదటగా ఒక గ్రూప్ ఎంపిక చేసుకుని, తర్వాత వివిధ కారణాల వల్ల వేరే గ్రూపుకు మారుతుం టారు. అలాంటి విద్యార్థులకు మరింత తక్కువ సమయం దొరుకుతుంది. ఈ విధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు చాలా ఒత్తిడితో పరీ క్షలకు హాజరు అవుతున్నారు. దీని ప్రభావంతో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంటుంది.
అలాంటి విద్యార్థులు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో గతంలో ఫెయిల్ అయిన సబ్జెక్టులు రెండవ సంవత్సరం సబ్జెక్టులు కలిపి పరీక్షలకు ఒకేసారి హాజరు కావడం వల్ల రెండింటి లోనూ ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఆత్మహత్యలకు గురి అవుతున్న విద్యార్థులలో అత్యధిక శాతం ఇంటర్మీడియట్ విద్యార్థులే అని గణాంకాలు చెబుతున్నాయి. ఇంటర్ ఫలితాలు వెలువడిన ప్రతిసారి విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. ఇంటర్మీడియట్ లో చేరే విద్యార్థులు కోర్సు మొదలయిన రోజు నుండి ఫలితాలు వచ్చే వరకు రెండు సంవత్సరాల పాటు నిరంతర ఒత్తిడిలో ఉంటారు.
దీనికి కారణం బోర్డు పరీక్షలు, కార్పొరేట్ శక్తుల, తల్లిదండ్రుల ఒత్తిడి.ఫస్టియర్ పరీక్ష తొలగింపే బెటర్!దేశంలో కేవలం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో మాత్రమే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర బోర్డు పరీక్షలు జరుగు తున్నాయి.
మిగతా రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కేవలం అంతర్గత మూల్యాంకనం ద్వారా మాత్రమే విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను నమోదు చేస్తారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్ని తొలగిస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గి మొదటి ఏడాది సిలబస్ లో కీలక అంశాలపై పట్టు సాధించడంతో పాటు వాటి ఆధారంగా రెండో ఏడాది సబ్జెక్టులపై పట్టు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పరీక్ష లలో రాణించే అవకాశం ఉంది.
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే సమయం, సౌలభ్యం దొరుకు తుంది. అధ్యాపకులు కూడా పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు వెసులు బాటు ఉంటుంది. అదే విధంగా జాతీయ బోర్డు మరియు ఇతర రాష్ట్రాల బోర్డులు కేవలం 12 వ తరగతి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నందున వారితో సారూప్యత ఏర్ప డుతుంది. కానీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలగిస్తే విద్యార్థులు, ఆధ్యాపకులలో మొదటి సంవత్సరంపై శ్రద్ధ తగ్గి కేవలం రెండవ సంవత్సరంపై మాత్రమే దృష్టి పెడుతారని కొందరు విద్యావేత్తల అభిప్రాయం. మొదటి సంవత్సరం ఇంటర్నల్ పరీక్షలు, మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించడం ద్వారా దీనిని అధిగమించవచ్చు.అభ్యసన సామర్థ్యాల మెరుగుదల అప్పుడే.విద్యార్థులపై మానసిక ఒత్తిడి తగ్గడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతా యని పరిశోధనల ద్వారా రుజు వయింది.
ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్స రంలో బోర్డు పరీక్షలను రద్దు చేసి అంతర్గత మూల్యాంకనం ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయినీ నమోదు చేస్తే మానసిక ఒత్తిడి తగ్గి, జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో మాదిరిగా మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు కూడా భయం రహితంగా పరీక్షలకు సిద్ధం అవు తారు.విద్యార్థుల ఆత్మహత్యలు తగ్గే అవకాశం ఉంది. పోటీ పరీక్ష మాయా జాలంలో పడి మధ్యతరగతి తల్లిదండ్రులు వారి ఆర్థిక స్తోమతను కన్నా ఎక్కువగా అప్పులు చేసి వారి పిల్లలను కార్పొరేట్ కళాశాలలో చదివిస్తు న్నారు.
పిల్లలపై ఒత్తిడి పెరగడానికి తల్లిదం డ్రులు కారణమవుతున్నారు.వారి దృక్పథంలో మార్పు రావాలి.కార్పొరేట్ కళాశాల ల ప్రకటనల హోరు పై నియంత్రణ చెయ్యాలి ఒక్కక్కో కళాశాల 2 లక్షలు నుంచి 3 లక్షల వరకు పీజులు వసూలు చేస్తూ,యంత్రంలా పిల్లలను ఉదయం 5 నుంచే లేపి చదువు అంటూ బట్టి చదువును ప్రోత్సహిస్తారు.ఏ రకమైన క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు ఉండవు.విద్యార్థులు పిర్యాదుకు ప్రభుత్వం తరుపున ఒక సెల్ ఏర్పాటు చేయాలి

ఉమాశేషారావు వైద్య
9440408080

# పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు



తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు.

కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది.

తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చు అని తెలిపారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు

# ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వ పథకాలు



● ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి
● దరఖాస్తుల పరిశీలన క్షేత్ర స్థాయిలో జరగాలి ● మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ,సూర్య మేజర్ న్యూస్ : ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపికపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి కార్యచరణ ప్రణాళిక-సమీక్ష సమావేశంలో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు వెంకటేష్ దోత్రే, కుమార్ దీపక్, రాజర్షి షా, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ జి. ఈశ్వర్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇతర ప్రజా సంక్షేమ పథకాల అమలులో అందరూ నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అదే రోజున అర్హులైన వారికి పథకాల ఫలాలు అందే విధంగా అధికారులు పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేసి గ్రామసభలో అర్హులను గుర్తించాలని, ఆయా గ్రామసభలలో స్థానిక ప్రజలు తప్పనిసరిగా పాల్గొనేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. రైతు భరోసాలో అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదని, రాళ్లు, గుట్టలు, కాలనీలు, ఇండ్ల వెంచర్లు, లే అవుట్లు, నాలా భూములు, వివిధ అభివృద్ధి పథకాల కొరకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తించేలా చూడాలని తెలిపారు. 10 సంవత్సరాల తర్వాత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు ప్రకటించడం జరిగిందని, అర్హులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ పథకాల అమలు బాధ్యత అధికార యంత్రాంగానికి అప్పగించడం జరిగిందని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసే అర్హత గల లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేయాలి

● శాఖల వారీగా ప్రతినెలా ఖర్చు వివరాలు వెల్లడించాలి
● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రతి శాఖలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు సకాలంలో ఖర్చు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశంలో సమావేశం నిర్వహించారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం శాఖల వారీగా చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెల రోజులకు ఒకసారి వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ఉన్న నిధులను సంపూర్ణ స్థాయిలో వినియోగించాలని కోరారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం చేస్తున్న వ్యయం ఆయా వర్గాల్లో ఆదాయం బాగా పెరిగేలా, ఆస్తులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 23న నిర్వహించబోయే సమావేశానికి రావాలని అధికారులను కోరారు. సబ్ ప్లాన్ చట్టం కోటా ప్రకారం ఇప్పటివరకు నిధులు ఖర్చు చేయని శాఖల అధికారులు రాబోయే రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఆయా శాఖ అధికారులను ప్రశ్నించారు. బడ్జెట్ యేతర నిధులు ఖర్చు చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం జనాభా దామాషా లో నిధుల ఖర్చు జరిగిందా? లేదా? అందుకు సంబంధించిన సంపూర్ణ సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. అమలుకు సంబంధించి గత ఎనిమిది సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసిన సెస్ నివేదికను సమావేశాలు సంబంధిత అధికారులు ప్రదర్శించారు. సెస్ అధికారులు పరిశీలించిన అంశాలు, వారు పరిశీలించిన అంశాలపై అధికారులు సాధించిన ఫలితాలను డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఇకనుంచి సెస్ అధికారులు తమ నివేదికలను ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ అధికారులకు అందజేసి వారితో తరచూ సమావేశం కావాలని సెస్ అధికారులను ఆదేశించారు. అటవీ భూముల్లో సోలార్ పవర్ ద్వారా మోటార్లు వినియోగించడం. ఆయా భూముల్లో వెదురు, అవకాడో, పామాయిల్ వంటి వాటితోపాటు అంతర పంటల సాగు ప్రాజెక్టులు డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రయత్నం ద్వారా అడవులను సంరక్షించడంతోపాటు ఆదివాసి, గిరిజన రైతులకు ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. మూసి పునర్జీవనం కార్యక్రమంలో నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించి వారికి వడ్డీ లేని రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు ఆయా వర్గాలకు అందించాలని సూచించారు. ఇందిర జల ప్రభ, మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీ రైతులకు ఆర్థిక చేయూతను అందించాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేసేందుకు వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలతో ఎస్సీ, ఎస్టీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు సమావేశమై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్ రాజ్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్టి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జున అవార్డు అందుకున్న అథ్లెట్ దీప్తి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్రపతి భవన్లో జరిగిన జాతీయ క్రీడా అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం అర్జున అవార్డును అందుకున్న మన తెలంగాణ క్రీడారత్నం, వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామ ముద్దుబిడ్డ, పారా ఒలింపియన్ అథ్లెట్ దీప్తి జీవంజి కి హృదయపూర్వక శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఉన్నారు. తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ నాటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలను ప్రోత్సహిస్తూ వారిని గౌరవిస్తూ అలాగే మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా మెరుగైన స్పోర్ట్స్ పాలసీతో ప్రజా ప్రభుత్వం ముందుకుపోతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గారు గుర్తుచేశారు.

## నేడు గ్రూప్-2 ప్రాథమిక కీ విడుదల : టీజీపీఎస్సీ



తెలంగాణ బ్యూరో్ప్రతినిధి : గ్రూప్-2 రిక్రూట్మెంట్ విషయంలో టీజీపీఎస్సీ కీలక అప్డేట్ ఇచ్చింది. నేడు 18వ తేదీన గ్రూప్-2 రాత పరీక్షల ప్రాథమిక కీని విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ అధికారులు ప్రకటించారు. ఈ నెల 18 నుంచి 22 వరకు అభ్యర్థుల లాగిన్లో ప్రాథమిక కీ అందుబాటులో ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆన్లైన్లోనే అభ్యంతరాలను తెలపాలని సూచించారు.

# నీటి వాటాల పాపం బీఆర్ఎస్దే

● పదేండ్ల పాటు తెలంగాణకు తీరని ద్రోహం ● నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కృష్ణా జలాలను పదేండ్లుగా పట్టించుకోని బీఆర్ఎస్ లీడర్లు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు. కృష్ణా జలాల నదీ వివాదానికి సంబంధించి తెలంగాణలో ఉన్న పరివాహక ప్రాంతం, ఆయకట్టు ఆధారంగా వాటాలు పెరగాలని కాంగ్రెస్ పార్టీ తొలినుంచి పోరాటం చేస్తూ వస్తోంది. నదీ జలాల వాటాలు దక్కించుకోవడంలో తొలి పదేండ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొద్ది నెలలకే 2015 జూన్లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో వాటాల వినియోగానికి సంబంధించి ఒప్పందం చేసుకుంది.

ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీలు వాడుకునేలా ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఈ చీకటి ఒప్పందంతోనే తెలంగాణ తీరని అన్యాయం జరిగింది. ఈ తాత్కాలిక కేటాయింపులపై ప్రతి ఏడాది సంతకాలు చేసింది బీఆర్ఎస్ లీడర్లు కాదా..? కృష్ణా జలాల వాటాలను తేల్చాలని పోరాటం చేయకుండా ఎందుకు తాత్కాలిక కేటాయింపులకు సంతకాలు చేశారు. కృష్ణా జలాలపై మీరు ఆడిన నాటకాలను అసెంబ్లీలో నిలదీసి శ్వేత పత్రం విడుదల చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. మొత్తం 811 టీఎంసీల్లో ఏపీకి 70 శాతం, తెలంగాణకు 30 శాతం బీఆర్ఎస్ ఒప్పుకొని అన్యాయం చేస్తే... కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం వాటా రావాలని, ఏపీకి 30 శాతం కేటాయించాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వం. భౌగోళికంగా నదీ పరివాహక ప్రాంతానికి అనుగుణంగా, అంతర్జాతీయ నీటి ఒప్పందాల ప్రకారం తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం పట్టుబట్టింది, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే.

తెలంగాణకు దక్కాల్సిన వాటా విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ (3) అంశం తెరపైకి వచ్చింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)కు ఓకే చెప్పింది. ఇందులో బీఆర్ఎస్ గొప్పతనమేమీ లేదు. బీఆర్ఎస్ లీడర్లు చేసిందేమీ లేదు. నదీ జలాల వాటాలను తేల్చకుండా జాప్యం జరగడంలో బీఆర్ఎస్ ప్రధాన దోషి. వాళ్ల హయాంలో తెలంగాణకు అన్యాయం.. ద్రోహం జరిగింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు వీలుగా ఏర్పాటైన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ గడువును కేంద్రం పలుమార్లు పొడగించింది. నిర్దిష్ట కాల వ్యవధిలో ఈ కేటాయింపులు జరిగేలా గడిచిన పదేండ్లలో ఎందుకు ఒత్తిడి చేయలేదు..?

మేం అధికారంలోకి వచ్చిన తర్వాతనే బ్రిజేష్ ట్రిబ్యునల్ ద్వారా తొందరగా నీటి కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాం. మహబూబ్నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతులు నష్టపోతుంటే కళ్లప్పగించి ప్రేక్షక పాత్ర పోషించింది ఎవరు..? బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలించింది. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని అదనంగా మరో 44 వేల క్యూసెక్కులకు పెంచింది. కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోకుండానే ఏపీ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోసేలా రాయలసీమ ఎత్తిపోతల, 80 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు విస్తరణ పనులకు రూ.6,829.15 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చూసీ చూడనట్లు నటించింది. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే దాకా అపెక్స్ మీటింగ్ కు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దుమ్మా కొట్టింది నిజం కాదా..? గోదావరి జలాలను రాయలసీమ దాకా తీసుకెళ్లి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెప్పిందెవరు... కేసీఆర్ కాదా?కృష్ణా, గోదావరి జలాల వాటాలను కొట్లాడి తెచ్చుకోవాల్సింది పోయి.. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లే నాటకాలాడింది మీరు.. తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. గొప్పలు చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. పోతిరెడ్డిపాడు నుంచి అదనంగా నీళ్లు తరలిస్తుంటే, అప్పుడు అధికారంలో ఉన్న హరీశ్రావు ఎందుకు సైలెంట్గా ఉన్నాడు.బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పు అవార్డు కాకుండానే ఏపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాల్వ విస్తరణ పనులు చేపడితే.. ఎందుకు చర్యలు తీసుకోలేదు. 1978 గోదావరి అవార్డు ప్రకారం... పోలవరం ప్రాజెక్టుకు అధికారిక అనుమతులు వచ్చిన వెంటనే నాగార్జునసాగర్ ఎగువన ఉన్న పై రాష్ట్రాలకు నీటి హక్కులు సంక్రమిస్తాయని చెబుతోంది. ఎగువ రాష్ట్రం తెలంగాణే అయినందున అక్కడ రావాల్సిన 45 టీఎంసీల నీటి వాటా తెలంగాణకే దక్కాలి. పోలవరం కాకుండా ఇంకా ఏదైనా కొత్త ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి కష్ణాకు నీటిని తరలిస్తే అంతే పరిమాణం పై రాష్ట్రాలకు వాటా ఉంటుందని బచావత్ అవార్డు తెలిపింది. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఏపీకి తరలిస్తున్న 80 టీఎంసీల్లో తెలంగాణకు 45టీఎంసీల వాటా దక్కాలి కదా.. అప్పుడే మీరు పట్టుపడితే, నిజంగానే పోరాడితే తెలంగాణ నీటి వాటా 90 టీఎంసీల వరకు పెరిగేది కదా..? ఆ నీటి వాటాలు ఎందుకు తెచ్చుకోలేదు..? అది ఎవరి వైఫల్యం అని ప్రశ్నించారు.

## బీదర్, అఫ్జల్గంజ్ కాల్పుల కేసులో పురోగతి

తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః బీదర్, అఫ్జల్గంజ్ కాల్పుల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బీదర్లో కాల్పులు జరిపింది బీహార్ ముఠాగా గుర్తించారు. వారం రోజుల క్రితం ఛత్తీస్గఢ్ దోపిడీకి పాల్పడిన బీహార్ ముఠా.. హైదరాబాద్ నుంచి రాయ్పూర్.. అక్కడ నుంచి బీహార్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీదర్లో రెండు రోజులుగా రెక్కీ చేసి మరీ అమిత్ కుమార్ ముఠా దోపిడీ చేసింది. అనంతరం బీదర్లో దోపిడీ చేసిన నగదును హైదరాబాద్కు తీసుకొచ్చి ఇక్కడ రెండు బ్యాగ్లను కొనుగోలు చేసిన ముఠా.. అఫ్జల్గంజ్లో కొనుగోలు చేసిన బ్యాగ్లలోకి డబ్బులు నింపి అనంతరం పరారయ్యారు. పలు దోపిడీ కేసులో అమిత్ కుమార్ కీలక నిందితుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులతో బీదర్ పోలీసులు కలిసి రాయ్పూర్ వెళ్లారు. రాయ్పూర్, బీహార్లో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి దుండగులను పట్టుకుందనేందుకు యత్నిస్తున్నారు. కాల్పుల ఘటనలో నిందితులను పట్టుకునేందుకు మొత్తం 10 టీమ్స్ను ఏర్పాటు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. కాల్పుల ఘటనపై ఏబీఎన్ – ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సిటీ శివారులు అన్ని ప్రాంతాల్లో గాలిస్తున్నామన్నారు. దోపిడీ జరిగిన తీరు చూస్తే.. బీహార్కు చెందిన వాళ్ళుగా అనుమనిస్తున్నామన్నారు. బీదర్లో దోపిడీ తర్వాత నేరుగా హైదరాబాద్ అఫ్జల్గంజ్కు వచ్చారని.. ఒక వ్యక్తి రెండు ట్రావెల్ బ్యాగ్లు అఫ్జల్ గంజ్లోని షాప్లో కొన్నాడని... ఈ బ్యాగ్లోకి డబ్బులు షిఫ్ట్ చేశారని చెప్పారు. రోషన్ ట్రావెల్స్లో రాయ్పూర్ వెళ్లేందుకు రెండు టికెట్లు బుక్ చేసుకున్నారన్నారు. ఇద్దరి కదలికలు అనుమానంగా ఉండటంతో డ్రగ్స్, గంజాయి ఏమైనా తరలిస్తున్నారా అనే అనుమానంతో ట్రావెల్స్ సిబ్బంది జహంగీర్ బ్యాగ్లు తనిఖీ చేయాలని పట్టుబట్టాడని తెలిపారు. అందులో డబ్బు ఉండటంతో హవాలా డబ్బుగా అనుమానించిన జహంగీర్ పోలీసలకు చెప్తాను అని అన్నాడని.. దీంతో వెంటనే దుండుగులు అతనిపై కాల్పులు జరిపినట్లు చెప్పారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో పారిపోయారని.. ట్యాంక్ బండ్ వరకు వెళ్ళారన్నారు. అక్కడి నుంచి బీహార్ వెళ్ళి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు.

కాగా.. నిన్న (గురువారం) కర్నాటక జిల్లా బీదర్లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఏటీఎంలో డబ్బులు జమ చేస్తున్న సిబ్బందిపై బైక్పై ముసుగుతో వచ్చిన ఇద్దరు దుంగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆ దుండగులు దాదాపు రూ.93 లక్షల నగదును తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడి నుంచి రాయపూర్ పరారయ్యే క్రమంలో హైదరాబాద్కు వచ్చిన వాళ్లు.. ఇక్కడ కూడా ఓ ట్రావెల్స్ ఉద్యోగిపై కాల్పులు జరపడం తీవ్ర కలకలం రేపింది. ఈ కేసును సీరియస్గా తీసుకున్న పోలీసులు దుండగుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## ఏపీ సర్వోదయ మండల్ కన్వీనర్గా నరహరశెట్టి శ్రీహరి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హైకోర్టు సీనియర్ న్యాయవాది నరహరశెట్టి శ్రీహరి ఆంధ్రప్రదేశ్ సర్వోదయ్ మండల్ కన్వీనర్ గా నియమితులయ్యారు. గాంధీ సిద్దాంతాలు, ఆశయాలను నెరవేర్చే క్రమంలో గతంలో మీరు నిర్వహించిన పాత్రను పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యత మీకు అప్పగించామని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ్ ప్రధాన కార్యాలయ కార్యదర్శి ప్రొఫెసర్ జి. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య వినోబావే, లోక్ నాయక్ జయప్రకాష్ లు 1948లో స్థాపించిన ఈ సంస్థ ఆశయాలను, సిద్దాంతాలను మీరు ప్రజల్లోకి తీసుకువెళతారని భావిస్తున్నామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. నిబద్దత, చిత్తశుద్ది కలిగిన మీ నాయకత్వంలో మరిన్ని కార్యక్రమాలు కొనసాగాలని, కొత్తగా సభ్యులను చేర్పించాలని, జిల్లా, మండల వారీగా సభ్యుల నియామకం చేపట్టాలని ఆయన ఆదేశించారు.

## బీఆర్ఎస్ రైతు దీక్ష డ్రామానే

### 26 నుండి రైతు భరోసా అమలు : ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: జనవరి 26 నుండి రైతు భరోసా అమలు అవుతుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. రైతులు, రైతు కూలీలకు భరోసా ఇస్తాం అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, షెడ్యూల్ ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ రైతు దీక్ష అంటూ డ్రామా చేస్తుందని మండిపడ్డారు. తాము దీక్ష చేస్తేనే.. ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చిందని చెప్పుకునే పనిలో బీఆర్ఎస్ ఉందని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా మోసాలపై రైతు ధర్నా పేరుతో బీఆర్ఎస్ పోరాటం చేస్తోంది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్లో రైతు ధర్నా చేపట్టింది.బీఆర్ఎస్ రైతు ధర్నా నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించారు. జనవరి 26 నుండి రైతు భరోసా అమలు అవుతుంది. రైతులు, రైతు కూలీలకు భరోసా ఇస్తాం అని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ రైతు దీక్ష అంటూ డ్రామా చేస్తుంది. మేము దీక్ష చేస్తేనే ప్రభుత్వం భరోసా ఇచ్చిందని చెప్పుకునే పనిలో బీఆర్ఎస్ ఉంది. రైతులకు బోనస్ ఇచ్చింది మేము, మీరు కాదు. దేశంలో ఎక్కడా బోనస్ ఇవ్వట్లే. వరంగల్ డిక్లరేషన్లో ఇచ్చిన మాట ప్రకారమూ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. బీఆర్ఎస్ వడ్డీ మాత్రమే మాఫీ చేసింది. బీజేపీకి అసలు రుణాలు మాఫీ చేసే సంస్కృతి లేనే లేదు అని జీవన్ రెడ్డి విమర్శించారు.

విచారణ కేటీఆర్ మీద కొనసాగుతుంది. విచారణ ఎదుర్కొంటూ.. జడ్జి దగ్గరకు నేను వస్తా, నువ్వు వస్తావా అని అంటున్నాడు. వక్రీకరించే పనిలో కేటీఆర్ ఉన్నాడు. విచారణ ఫార్ములా ఈ రేసుపై జరుగుతుంది. ప్రజల దృష్టి మరల్చడానికి కేటీఆర్ ఈ ఎత్తుగడ వేస్తున్నాడు అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. రైతులు పండించే సన్నాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే.

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు ఏప్రిల్ కోటా టికెట్ల విడుదల




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టాదళ పాదపద్మారాధన సేవకు సంబంధించి ఏప్రిల్ కోటా టికెట్లను జనవరి 18న ఆన్లైన్లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) తెలిపింది. ఈ– టికెట్ల కోసం జనవరి 18 నుంచి 20న ఉదయం 10 గంటల వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని తెలిపింది. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు నిర్వహించనున్న స్వామివారి సాలకట్ల వసంతోత్సవాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలకు సంబంధించిన టికెట్లను జనవరి 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. వర్చువల్ సేవలు, దర్శన స్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఏప్రిల్ కోటాను జనవరి 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్లైన్లో విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి : డాక్టర్ కె. లక్ష్మణ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు కృషిచేయాలని ఆలిండియా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ సూచించారు. గురువారం నూతనంగా ఎన్నికైన కవాడిగూడ, గాంధీనగర్, అడిక్మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సలంద్రి దిలీప్యాదవ్, నవీన్కుమార్, పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు డాక్టర్ లక్ష్మణ్ను కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వివరిస్తూ పార్టీ పటిష్టతకు పాటుపడాలని నూతన అధ్యక్షులకు సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా పదవులు వస్తాయని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజవర్గంలోని ఆరు స్థానాల్లో బీపేపీని గెలిపించి, పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. డాక్టర్ కె.లక్ష్మణ్ కలిసిన వారిలో కార్పొరేటర్ జి రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ నాయకులు జి వెంకటేష్, రంగరాజ్గౌడ్, పరిమళ్కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం. రమేష్ రాం, సురేష్ ముదిరాజ్, ఆర్ పద్మ, ఎంసీ మహేందర్బాబు, ఏ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు. శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజు. బొల్ల రమేష్, లింగంగౌడ్, మాజీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ తదితరులున్నారు.

# మెదక్ ఎంపీ రఘునందన్ రావు అరెస్ట్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ కీలక నేత, మెదక్ ఎంపీ రఘునందన్రావును పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సాయంత్రం వెలిమల తండాలో అదుపులోకి తీసుకున్నారు. అటునుంచి నేరుగా రఘునందన్రావును పటాన్చెరు పీఎస్కు తరలించారు. ఉదయం నుంచి గిరిజనులకు మద్దతుగా రఘునందన్రావు ఆందోళన నిర్వహించారు. రఘునందన్ రావును అరెస్టు చేసే సమయంలో గిరిజనులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, గిరిజనులకు మధ్య స్వల్పంగా తోపులాట, వాగ్వాదం జరిగింది. కాగా, వెలిమల భూ వివాదం గత పది రోజులుగా కొనసాగుతున్నది. తమకు న్యాయం చేయాలంటూ గిరిజనులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తాజాగా ఇవాళ గిరిజనుల ఆందోళనకు మద్దతుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు రంగంలోకి దిగారు. గిరిజనులకు బీజేపీ అండగా నిలుస్తుందని గురువారం పార్టీ కార్యాలయంలో ప్రకటించిన రఘునందన్ రావు.. శుక్రవారం ఉదయం పార్టీ శ్రేణులతో కలిసి వెలిమల తండాకు చేరుకున్నారు. గిరిజనులతో కలిసి ర్యాలీగా వెలిమల తండా నుంచి సదరు భూముల వద్దకు చేరుకుని గిరిజనులతో కలిసి ఆందోళన నిర్వహించారు.

# అవకాశం కల్పించండి సేవ చేస్తా



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: సంపాదించిన కోట్లు ఖర్చుపెట్టి కోట్లు దండుకోవడానికి రావట్లేదు సేవచేయడానికి సేవే పరమావధిగా మీ ముందుకు వస్తున్నానని పట్టభద్రుల ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట సిరిసిల్లలోని శ్రీ చైతన్య నారాయణ విద్యాసంస్థల్లో యాజమాన్యాలతో సమావేశమై మద్దతు కోరడం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా సేవా కార్యక్రమంలో ఒక్క సేవకుడుగ ఉన్నానని ఎమ్మెల్సీగా కాదు ఒక సేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించి శాసనమండలికి పంపితే పట్టభద్రుల గొంతుకనై ప్రశ్నిస్తానని అన్నారు కోట్లు సంపాదించి ఆ సంపాదనను దాచిపెట్టుకో నీకు లేదా కోట్ల సంపాదన ధ్యేయంగా రావడంలేదని సేవా దృక్పథంతోనే మీ ముందుకు వస్తున్నానని మీ సేవకుడిగా నన్ను శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ట్రస్మా అధ్యక్షులు గోపాలవురం సుభాష్ ,ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి మరియు సిరిసిల్ల ట్రస్మా పట్టణ అధ్యక్షులు శబరి శ్రీనివాస్ ,ఆనంతుల శ్రీనివాస్ ,పండుగ రమేష్ ట్రస్మా బాద్యులు పాల్గొన్నారు.

## తెలుగు వాడి గుండెలో ఎన్టీఆర్

# చెరగని సంతకం

### తెలుగు జాతిలో రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన ఘనుడు

### ఆత్మగౌరవం. ప్రజాహిత పాలనకు నిలువెత్తు రూపం



**‘కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు మహాపురుషులౌతారు తరతరాలకి తరగని వెలుగౌతారు ఇలవేలుపులౌతారు’ .. అన్న అభియుక్తికి నిలువెత్తు నిదర్శనం అన్న ఎన్టీఆర్. తెలుగు జాతిలో రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్.. మహాభారత, భాగవత, రామాయణాల్లోని పాత్రలకు సహజత్వాన్ని తీసుకొచ్చి మన కళ్ళముందు కదలాడారు. అసాధ్యాలను సుసాధ్యాలుగా మలుస్తూ.. ఓ మహాయోధుడిగా, ఓ కారణజన్ముడిగా, ఓ యుగపురుషుడిగా నిలిచారు ఎన్టీఆర్. తెలుగు జాతికీ, భాషకూ విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహామనిషి నందమూరి తారక రామారావు. నందమూరి తారక రామారావు’.. ఈ మాటే ఓ సంచలనం.. రాజకీయాల్లో ప్రభంజనం.. ప్రతి తెలుగువాడి ఆత్మగౌరవం. ప్రజాహిత పాలనకు నిలువెత్తు రూపం.. సంక్షేమ పథకాలకు తారకమంత్రం అన్న ఎన్టీఆర్. వర్ధంతి సందర్భంగా....**

ఎన్టీఆర్ వ్యక్తి కాదు శక్తి.. ఆయనొక సంచలనం, తెలుగువాడి విశ్వ రూపం. ఆయన ఆత్మగౌరవ నినాదం తెలుగుజాతి గుండెల్లో నేటికీ మారుమోగుతూనే ఉంది. మనం ఎక్కడ పుట్టాం, ఎలా పుట్టామన్నది ముఖ్యం కాదు. ఆ ప్రాంతానికి, ఆ జాతికి ఏం చేశాం, వారిలో ఎంత స్ఫూర్తిని నింపామన్నది ముఖ్యం. అలాంటి కారణజన్ముడు, యుగపురుషుడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది జనహితమే... అదో సంచలనం. ఐదు దశాబ్దాలు సినీ, రాజకీయ, సామాజిక రంగాల్లో తెలుగువారి ఆశలను, ఆశయాలను బాగా ప్రభావితం చేశారు. రాజకీయ, సినీరంగంపైనే కాదు.. యావత్ తెలుగు నేలపై ఎన్టీఆర్ పేరు చెరగని సంతకం. తెలుగుదేశం పార్టీ ఏర్పాటే ఓ సంచలనం అయితే తారకరాముడి అనూహ్య నిర్ణయానికి ఢిల్లీ కోటలే కదిలాయి. రాజ్యసభ సీటు ఇస్తాం అంటూ రాయభారాలు మొదలయ్యాయి. ‘లక్ష్య సాధనలో విజ్ఞులు ఎప్పుడూ ప్రలోభాలకు లొంగరనే’ వివేకానందుడి మాటల్ని ఒంటిపట్టించుకున్న అన్న ఎన్టీఆర్ వెనకడుగు వేయలేదు. ఓట్లేయండని.. జనంలోకి వచ్చేసరికి జనం నీరాజనాలు పలికారు.

**చైతన్య రథం పై ఊరూరా**

చైతన్య రథం ఎక్కి ఊరూరా తిరుగుతూ.. పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారాన్ని చేపట్టి.. దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న కాంగ్రెస్ను మట్టికరిపించారు. రైట్ పర్సన్ ఇన్ రైట్ టైమ్ అనే మాటను అక్షరాలా నిజం చేస్తూ.. రాజకీయ శూన్యతను మందే పసికట్టిన ఢిల్లీ నాయకుల్ని బెంబేలెత్తించి తెలుగోడి సత్తాను రుచి చూపించారు. ఆయన పిలుపు ఓ నవ్యోపదేశం అయ్యింది.. ఆయన పలుకు ఓ సంచలనమై విరజిల్లింది .. ఆయన ప్రతి మాట ఓ తూటాగా.. ఆయన సందేశమే స్ఫూర్తిగా జనాల్లోకి చొచ్చుకుని వెల్లింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర%శీ% ఏర్పడిన తర్వాత సంవత్సరాల తరబడి ముఖ్యమంత్రి పదవి కాంగ్రెస్ చేతిలో ఉండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్టీఆర్ మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి ఆయన అందుకే రాజకీయం అనే డిక్షనరీలో తొలిపేజీలో అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ అన్న ఎన్టీఆర్దే మొదటి స్థానం.

**పేదవాడే నా దేవుడు.. సమాజమే నా దేవాలయం’**

పురాణ పురుషుల పాత్రలు ధరించి కలియుగ దైవంగా ప్రతి ఇంటా ఆరాధించ బడ్డ నటుడు రాజకీయ నేతగానూ అభిమానించబడ్డారు. కృష్ణుడు అంటే ఎలా ఉంటారో.. రాముడు అంటే ఎలా ఉంటారు తెలియని వారికి ఇదిగో వారి రూపం అంటూ నటుడిగా సాక్ష్యాత్కరించిన నటసార్వభౌముడు ఎన్టీఆర్.. నాయకుడంటే ఇలా ఉంటాడు అని పాలించి చూపించారు. అధికారం చేపట్టిన నాటి నుండి ఏదైతే చెప్పారో అదే చేసి చూపారు. తప్పుడు వాగ్దానాలు.. తప్పించుకునే ధోరణి ఆయన పాలనలో ఏనాడు దరిచేరనివ్వలేదు.‘పేదవాడే నా దేవుడు.. సమాజమే నా దేవాలయం’ అంటూ కాషాయి వస్త్రాలను ధరించి ప్రజాక్షేమమనే దీక్ష పూనారు నాడు ఎన్టీఆర్ స్థాపించిన ‘తెలుగు దేశం పార్టీ’ అప్పటి నుండి ఇప్పటి వరకూ రాష్ట్ర రాజకీయాల్లోనూ.. దేశ రాజకీయాల్లోనూ బలీయమైన శక్తిగా ఎదిగిందంటే అది ముమ్మాటికీ అన్న ఎన్టీఆర్ వేసిన పటిష్ఠ పునాదులు... ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు.. అమలు చేసిన సంక్షేమ పథకాలే కారణం.

**దైవపాత్రలు ప్రత్యేకం**

1940ల్లో కుటుంబానికి అండగా ఉండడం కోసం విజయవాడలో హొటళ్లకు ఎన్టీఆర్ పాలు పోసేవారు 40 ఏళ్ళ వయసులో ఎన్టీఆర్ నృత్యం నేర్చుకోవడం మొదలుపెట్టారు. ప్రముఖ కూచిపూడి డాన్సర్ వెంపటి చినసత్యం దగ్గర ఆయన నృత్యం నేర్చుకున్నారు. ఎన్టీఆర్ ను భగవత్స్వరూపంగా భావించే ఆయన అభిమానులను అలరించడానికి ఆయన 17 సినిమాలలో శ్రీ కృష్ణుడి వేషం కట్టారు. ఒక మహానటుడుగా తెలుగు ప్రజల నీరాజనాలు అందుకున్నారు. హీరో అంటే ఎలా ఆదర్శంగా ఉండాలో భవిష్యత్ తరాలకు తెలియజెప్పిన ఘనత ఆయన సొంతం. అందుకే దశాబ్దాలు గడిచినా ప్రేక్షకుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. తెలుగు తెరపై అందాల రాముడైనా, కొంటె కృష్ణుడైనా, ఏడుకొండలవాడైనా ఇలా ఏ పాత్రైనా ఎన్టీఆర్ చేస్తేనే ఆ పాత్రలకు నిండుదనం. కేవలం పౌరాణిక పాత్రలే కాదు.. సాంఘిక, జానపద, చారిత్రకం... ఏవైనా ఆయన నటిస్తే ఆ పాత్ర పరిపూర్ణమవుతుంది. నాలుగు దశాబ్దాల పాటు తనను ఆరాధించిన ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతోటే రాజకీయరంగ ప్రవేశం చేశారు. సినీ రంగంలో ఉన్నప్పుడు కూడా వివిధ సందర్భాల్లో జోలెపట్టి ఊరూరా తిరిగి, నిధులు సేకరించి బాధితులను ఆదుకున్నారు.


**నటసార్వభౌముడుగా**

విశ్వ విఖ్యాత నటసార్వభౌముడుగా బిరుదాంకితుడైన ఆయన, అనేక పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో వైవిధ్యభరితమైన పాత్రలెన్నో పోషించి మెప్పించడమేగాక, రాముడు, కృష్ణుడు వంటి పౌరాణిక పాత్రలతో తెలుగు వారి హృదయాలలో శాశ్వతంగా,ఆరాధ్య దైవంగా నిలచిపోయాడు. తెలుగు, తమిళం మరియు హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో నటించారు. నటుడిగానే కాకుండా.. నిర్మాతగా దర్శకుడిగా పలు చిత్రాలను నిర్మించారు. ఎన్టీఆర్ కృష్ణుడు, రాముడు, వెంకటేశ్వరుడు లాంటి పురాణ పాత్రలు చేసిన సినిమాల్లో ఎడమచేతితోనే ఆశీర్వదించేవారు, అభయం ఇచ్చేవారు. అలా ఎందుకని చాలా మందికి సందేహం ఉండేది, కొందరు ఆయన్నే డైరెక్టుగా అడిగారు కూడా.దానికి ఎన్టీఆర్ స్పందిస్తూ.. “మన హృదయం ఉన్నది ఎడమవైపు. పూజలలో భార్యను ఎడమవైపే కూర్చోబెట్టుకుంటాం. మన శరీరంలోని మాలిన్యాన్ని శుభ్రం చేసేది కూడా ఎడమ చెయ్యే. ఎడమ భాగానికున్న ప్రాధాన్యత కుడి భాగానికి లేదు. అందుకే ఎడమ చేతితోనే ఆశీర్వదిస్తున్నాను” అన్నారట.. అవతలివారు ఆశ్చర్యపోయాక అసలు గుట్టు విప్పేవారట ఎన్టీఆర్. సినిమాల్లో తీసే అడ్వెంచర్స్, ఫైటింగుల వల్ల, ఒక రోడ్డు ప్రమాదం వల్ల ఎన్టీఆర్ కుడిచెయ్యి నాలుగు సార్లు విరిగింది. వరుస ప్రమాదాలతో కుడిచేయి పట్టు తప్పడంతో ఎడమచేత్తోనే దీవెనలు ఇవ్వడం ప్రారంభించారట ఎన్టీఆర్.

**అన్నగారి కుటుంబం**

1923 మే 28న ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా, పామర్రు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ దంపతులకు జన్మించారు. 1942 మే నెలలో 20 ఏళ్ళ వయసులో మేనమామ కుమార్తె అయిన బసవ రామతారకాన్ని పెళ్ళి చేసుకున్నారు ఎన్టీఆర్. తారక రామారావు, బసవతారకం దంపతులకు 11 మంది సంతానం. పదకొండు మందిలో ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. జయకృష్ణ, సాయికృష్ణ. హరికృష్ణ, మోహనకృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ కుమారులు కాగాబీ గారపాటి లోకేశ్వరి, దగ్గుబాటి పురంధరేశ్వరి, నారా భువనేశ్వరి, కంటమనేని ఉమామహేశ్వరి కుమార్తెలు.ముప్పైమూడేళ్ళ తెర జీవితంలోను, పదమూడేళ్ళ రాజకీయ జీవితంలోను నాయకుడిగా వెలిగిన ఎన్టీఆర్.. ఎన్టీఆర్ తన ప్రతిభను కేవలం సినిమాకే పరిమితం చేయకుండా, రాజకీయాలలోనూ రాణించి దాదాపు 8 సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. పేదల బతుకుల తలరాతలను మార్చే కార్యక్రమాలెన్నిటికో శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ వర్దంతి సందర్భంగా ఆయన అభిమానులెందరో ఎవరికి వారే సేవా కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు. అన్న ఆశయ సాధనకు తమవంతు కృషి చేస్తున్నారు. ఎన్టీఆర్ భౌతికంగా దూరమైనా.. ఆయన చేసిన పాత్రలు తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలచిపోతాయి.

– విద్య వెంకట్
తెలంగాణ బ్యూరో – 9391618181



‘ఈ తెలుగుదేశం పార్టీ శ్రామికుడి చెమటలో నుండి వచ్చింది. కార్మికుడి కరిగిన కండాలల్లోనుండి వచ్చింది. రైతు కూలీల రక్తంలో నుండి వచ్చింది. నిరుపేదల కన్నీటిలో నుండి.. కష్టజీవుల కంటి మంటల్లో నుంచి పుట్టింది ఈ తెలుగుదేశం ఆశీర్వదించండి’ అంటూ.. 1982 మార్చి 29న హైదరాబాద్లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్లో కేవలం పదిమంది పత్రికా విలేకరుల మధ్యన ‘తెలుగు దేశం’ పార్టీని స్థాపిస్తున్నట్లు ప్రకటించారు.



**అనంతలోకాలకు**

ఇప్పటికి ఎందరో అభిమానులు ఆయనను ఒక దేవుడిగా కొలుస్తుండగా, ఎన్టీఆర్ నటించిన పాత్రలు, ఆయన చేసిన సేవా కార్యక్రమాలు ఎన్ని తరాలైనా మార్గదర్శకంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. ‘తెలుగు జాతి’కి గర్వకారణం తెలుగు పలుకులను తన కంఠంతో కొత్తపుంతలు తొక్కించిన ఆ అవిశ్రాంత యోధుడు 1996 జనవరి 18న 73 సంవత్సరాల వయసులో గుండెపోటుతో మరణించారు. రాజకీయాల్లో పటిష్ఠ పునాది వేసి.. తరతరాలకు యుగపురుషుడిగా నిలిచిన అన్న ఎన్టీఆర్ మళ్లీ పుట్టాలని ఆకాంక్షిస్తూ జోహార్ ఎన్టీఆర్. క్రితం అందరికీ భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు మాత్రం నేటికీ అందరిలోనూ అదే స్ఫూర్తిని నింపుతున్నాయి.


# ఇప్పటికే భారత స్క్వాడ్ ఖరారు.. కొత్త వారికి నో ఛాన్స్

ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. భారత్ ఇంకా తన స్క్వాడ్ను ప్రకటించలేదు. జనవరి 19లోగా ఎప్పుడైనా ఈ ప్రకటన రావొచ్చు. ఈ రేసులో దేశవాళీలో అదరగొట్టిన కరుణ్ నాయర్ కూడా ఉన్నాడని వార్తలు వస్తున్నాయి. అయితే, భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ మాత్రం జట్టు ఎంపిక ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చి ఉంటుందని.. కొత్తవారికి అవకాశం కష్టమేనని వ్యాఖ్యానించాడు. మయాంక్ అగర్వాల్ కూడా మంచి ఫామ్లో ఉన్నాడని పేర్కొన్నాడు.

**కరుణ్ నాయర్ బాదేస్తున్నాడు.. జట్టులోకి రీఎంట్రీ ఇస్తాడా?**

"కరుణ్ నాయర్ పేరు ఇప్పుడు బాగా వినిపిస్తోంది. అతడు అద్భుతమైన ఫామ్లో ఉన్నాడు. మయాంక్ అగర్వాల్ కూడా బాగానే ఆడాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత వన్డే జట్టు ఇప్పటికే సిద్ధమైందని భావిస్తున్నా. పెద్దగా మార్పులు కూడా ఉండకపోవచ్చు. కరుణ్ నాయర్ను జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. పునరాగమనం చేసేందుకు అతడికి హక్కు ఉంది.

బ్యాటింగ్తో అదరగొట్టాడు. కానీ, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అవకాశం వస్తుందని మాత్రం అనుకోవడం లేదు. ఇలాగే కొనసాగితే ఎందుకు తీసుకోకూడదనే ప్రశ్నలూ ఉత్పన్నమవుతాయి. ఫాస్ట్, స్పిన్ను అద్భుతంగా ఆడే బ్యాటర్ను వదులుకోకూడదు. అతడు 'గన్ షాట్' ప్లేయర్. జట్టులోకి వస్తే మాత్రం చాలా ఆనందిస్తా" అని వెల్లడించాడు. ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్తో వన్డే సిరీస్కు జట్టును ఎంపిక చేయాల్సిఉంది.



## నెట్‌లో చెమటోడుస్తున్న హార్దిక్, రోహిత్



కొంతకాలంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సరైన క్రికెట్ ఆడటం లేదు.. టెస్టుల్లో అయితే ఇంగ్లాండ్ సీరీస్ తర్వాత తన ఫామ్ కోల్పోయాడు.. ఇక హార్దిక్ పాండ్యా టి20 లలో మెరుస్తున్నప్పటికీ.. వన్డే ఫార్మాట్లో ఆశించినంత స్థాయిలో ఆడటం లేదు.

వైవాహిక జీవితంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల హార్దిక్ పాండ్యా తన మునుపటి క్రికెట్ ఆడలేక పోతున్నాడు. ఆ స్థాయిలో దూకుడు ప్రదర్శించలేకపోతున్నాడు. అందువల్లే అతడు గొప్పగా పరుగులు చేయలేకపోతున్నాడు. ఈ క్రమంలో అతడిని త్వరలో స్వదేశం వేదికగా ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు తో జరిగే టి20 సిరీస్ కు టీం ఇండియా మేనేజ్మెంట్ ఎంపిక చేసింది. ఈనెల 22 నుంచి ఇంగ్లాండ్ జట్టుతో టీమిండియా 5 %%20 ల సిరీస్ ను మొదలు పెడుతుంది. అయితే ఈ సిరీస్లో తన సత్తాను చాటడానికి హార్దిక్ పాండ్యా తహతలాడుతున్నాడు. ఇందులో భాగంగా మైదానంలో చెమటోడ్చుతున్నాడు.. నవీ ముంబై లోని ఓ మైదానంలో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతనితోపాటు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కూడా నెట్స్ లో బ్యాటింగ్ సాధన చేస్తూ కనిపించాడు. కొంతకాలంగా రోహిత్ శర్మ సరైన క్రికెట్ ఆడటం లేదు. టెస్టులలో వరుసగా విఫలమవుతున్నాడు. రెండంకెల స్కోర్ కూడా చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. గత ఏడాది జరిగిన టి20 వరల్డ్ కప్ లో మెరుగైన పరుగులు చేసినప్పటికీ.. అదే ఫామ్ చివరి వరకు కంటిన్యూ చేయలేకపోయాడు. దీంతో రోహిత్ పై విమర్శలు మొదలయ్యాయి. ప్రస్తుతం అతడు టి20 క్రికెట్ కు వీడ్కోలు పలికినప్పటికీ.. వన్డే, టెస్ట్ ఫార్మేట్ లో మాత్రం కెప్టెన్ గా కొనసాగుతున్నాడు.. తన ఆటతీరును పూర్తిగా మార్చుకోవడానికి రోహిత్ శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నాడు..

**తీవ్రంగా సాధన :** ఇంగ్లాండ్ జట్టుతో టీ20, వన్డే సిరీస్ ముగిసిన తర్వాత టీమిండియా ఫిబ్రవరిలో దుబాయ్ వెళ్లిపోతుంది. అక్కడ జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ లో తలపడుతుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆడే మ్యాచ్ లు మొత్తం హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నారు.. ఈ ట్రోఫీకి పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తోంది.. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ విజ్ఞప్తి చేయడంతో.. ఐసీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గత ఆసియా కప్ లోనూ టీమిండియా హైబ్రిడ్ విధానంలోనే మ్యాచ్లను ఆడింది.. టీమిండియా కు ఛాంపియన్స్ ట్రోఫీ అత్యంత ముఖ్యం కావడం.. గత సీజన్లో పాకిస్తాన్ చేతిలో ఓడిపోవడంతో.. ఈసారి ఎలాగైనా ట్రోఫీ దక్కించుకోవాలని టీమిండియా భావిస్తోంది. మ-రోవైపు రోహిత్ శర్మ కెప్టెన్సీ కూడా చరమాంకంలో ఉంది. ఇటీవల అతని ఆధ్వర్యంలోనే టీమిండియా టి20 వరల్డ్ కప్ గెలిచింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ లో ఓడిపోవడం%ా% టీమిండియా ఐసీసీ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్స్ వెళ్లే అవకాశాలను కోల్పోవడంతో.. ఆ రెండు ఓటములను మరిపించేందుకు ఖచ్చితంగా టీమిండియా కు ఛాంపియన్స్ ట్రోఫీని అందించాలని రోహిత్ శర్మ ఉత్సాహ పడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ భారత జట్టుకు అందించి.. టి20, మినీ వరల్డ్ కప్ లాంటి ఛాంపియన్స్ ట్రోఫీలు అందించి గౌరవంగా తప్పుకోవాలని భావిస్తున్నాడు. అందువల్లే రోహిత్ శర్మ తీవ్రంగా సాధన చేస్తున్నాడు.. నవీ ముంబైలో విపరీతంగా నెట్స్ లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు.. కఠినమైన బంతులను ఎదుర్కొంటున్నాడు. ఆఫ్ స్టంప్ బంతులను పదేపదే ఆడుతున్నాడు. తన వైఫల్యాన్ని అధిగమించడానికి ప్రయత్నిస్తున్నాడు.

# టీమిండియా జట్టు ప్రక్షాళనకు బీసీసీఐ శ్రీకారం



గత నాలుగైదు నెలలుగా భారత జట్టు టెస్ట్ మ్యాచ్లలో అత్యంత చెత్త ప్రదర్శన, ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్షిప్ ఫైనల్ బెర్తును సాధించడంలో విఫలమవడం, డ్రెస్సింగ్ రూమ్లో విభేదాలు, సీనియర్ ప్లేయర్ల పేలవ ఆటతీరు వంటి సమస్యల నేపథ్యంలో బీసీసీఐ జట్టులో మార్పులు చేయాలని నిర్ణయించింది. ఆస్ట్రేలియా పర్యటన ముగిసిన తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్తో పాటు బీసీసీఐ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. గంభీర్ పలు కీలక సూచనలు చేయగా, వాటిని పరిగణనలోకి తీసుకుని బీసీసీఐ పది ముఖ్యమైన పాయింట్లతో కొత్త పాలసీని ప్రకటించింది.

**ప్రధాన నిర్ణయాలు:**

**దేశవాళీ టోర్నీల్లో పాల్గొనడం:** జాతీయ జట్టుకు ఎంపిక కావాలంటే క్రికెటర్లు దేశవాళీ టోర్నీల్లో తప్పనిసరిగా ఆడాలి. ఈ నిర్ణయం యువ క్రికెటర్లకు నిపుణుల అనుభవం అందించడంలో దోహదపడుతుంది.

**జట్టుగా ప్రయాణం:** ప్లేయర్లు వ్యక్తిగతంగా కాకుండా జట్టుగా ప్రయాణించాలని ఆదేశించారు. ఫ్యామిలీతో ప్రయాణించాలంటే ముందస్తుగా కోచ్ లేదా సెలక్షన్ కమిటీ అనుమతి అవసరం.

**లగేజీ పరిమితులు**: ప్లేయర్లు బాగ్స్ బరువుపై నిబంధనలకు కట్టుబడి ఉండాలి. అదనపు బరువుకు తమ ఖర్చుతోనే భరించాల్సి ఉంటుంది.

**వ్యక్తిగత సిబ్బంది పరిమితి:** బోర్డు అనుమతి లేకుండా వ్యక్తిగత సిబ్బంది (మేనేజర్లు, చెఫ్స్, సెక్యూరిటీ)ను వెంట తీసుకురావడం వీలుకాదు.

**ప్రాక్టీస్ తర్వాత ప్రయాణం:** షెడ్యూల్ ప్రాక్టీస్ పూర్తయ్యే వరకు ప్లేయర్లందరూ ఉండాలి. ప్లేయర్లు ప్రాక్టీస్ అనంతరం కలిసి ప్రయాణించాలి.

**ఎండార్స్మెంట్లపై నిబంధనలు:** పర్యటన సమయంలో ఎలాంటి వ్యక్తిగత షూట్లు లేదా ఎండార్స్మెంట్లకు అనుమతి లేదు. ఆటపై ఏకాగ్రత దెబ్బతినకుండా ఇది నిర్దేశించబడింది.

కుటుంబ సభ్యుల అనుమతి: 45 రోజుల కంటే ఎక్కువ గల విదేశీ పర్యటనల్లో మాత్రమే ప్లేయర్ల కుటుంబ సభ్యులకు రెండు వారాల అనుమతి ఉంటుంది.

**బోర్డు షూటింగ్లకు అందుబాటులో ఉండడం:** బీసీసీఐ అధికారిక కార్యక్రమాలకు ప్లేయర్లు అందుబాటులో ఉండాలి. ఇది క్రికెట్ అభివృద్ధికి దోహదపడుతుంది.

మ్యాచ్ అనంతరం ప్రయాణం: సిరీస్ లేదా మ్యాచ్లు ముందుగానే ముగిసినా, అందరూ కలిసే ప్రయాణం చేయాలి.

**మెరుగైన సంబంధాలు:** వీటి ద్వారా జట్టులో ఐక్యత పెరుగుతుందని, ఆటలో మెరుగుదలకు ఇది సహాయపడుతుందని బోర్డు విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ కొత్త పాలసీ ప్రకారం జట్టు సభ్యులందరూ క్రమశిక్షణతో ఉంటూ, జట్టు కోసం కట్టుబడి పనిచేయాలని బీసీసీఐ స్పష్టంగా చెప్పింది.

# లేడీ ఎంపీతో టీమిండియా క్రికెటర్ రింకూ సింగ్ ఎంగేజ్మెంట్



టీమిండియా యంగ్ క్రికెటర్ రింకూ సింగ్.. అదిరిపోయే శుభవార్త చెప్పాడు. ప్రస్తుతం టీమిండియా టి20 జట్టులో అదరగొడుతున్న ఈ డేంజర్ బ్యాట్స్మెన్ రింకు సింగ్%ా% ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. త్వరలోనే.. టీమిండియా స్టార్ ఆటగాడు రింకు సింగ్%ా% పెళ్లి చేసుకోబోతున్నాడు. ఇందులో భాగంగానే ఎంగేజ్మెంట్ కూడా చేసుకున్నాడు ఈ స్టార్ ఆటగాడు రింకు సింగ్.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన సమాజ్వాది పార్టీ పార్లమెంట్ సభ్యులు ప్రియా సరోజ్‌ను పెళ్లి చేసుకోబోతున్నాడు రింకు సింగ్. ఇందు లో భాగంగానే తాజాగా ఎంపీ ప్రియా సరోజ తో ఎంగేజ్మెంట్ కూడా చేసుకున్నాడు ఈ యంగ్ క్రికెటర్ రింకు సింగ్. దీనికి సంబంధించిన న్యూస్ వైరల్ కావడంతో అందరూ%ా% టీమిండియా క్రికెటర్ రింకు సింగ్ కూ కంగ్రాట్స్ చెబుతున్నారు. ఇవాళ ఉదయం రింకు సింగ్ అలాగే ఎంపీ ప్రియా సరోజ్ ఎంగేజ్మెంట్ జరిగినట్లు తెలుస్తోంది. సీక్రెట్ గా తన కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఈ ఎంగేజ్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారట.

సరోజ్%ా% మొన్నటి లోక్సభ ఎన్నికలలో ఎంపిగా విజయం సాధించారు. 25 ఏళ్ల వయసులో మచ్లిషహర్ సీటును గెలుచుకున్న సరోజ్%ా%.అతి పిన్న వయస్కురాలైన ఎంపీలలో ఒకరు. గతంలో సుప్రీంకోర్టు న్యాయవాదిగా కూడా పనిచేశారు ప్రియా సరోజ్. రింకు సింగ్ కాబోయే భార్య ప్రియా సరోజ్%ా%తుఫాని సరోజ్ కుమార్తె. ఉత్తరప్రదేశ్ నుంచి మూడుసార్లు పార్లమెంటు సభ్యురాలుగా తుఫాని సరోజ్ పనిచేయడం జరిగింది. ఆమె ప్రస్తుతం ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు తుఫాని సరోజ్. న్యూఢిల్లీలోని ఎయిర్ ఫోర్స్ గోల్డెన్ జూబ్లీ ఇన్స్టిట్యూట్లో పాఠశాల విద్యను పూర్తి చేసింది ప్రియా సరోజ్. ఆమె ఢిల్లీ యూనివర్శిటీ నుంచి పట్టభద్రురాలైంది. నోయిడాలోని అమిటీ యూనివర్శిటీలో లా పూర్తి చేసింది ప్రియా సరోజ్.

అయితే ప్రియా సరోజ అలాగే రింకు సింగ ప్రేమించుకొని పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని రహస్యంగా ఉంచినట్లు సమాచారం. ఇక వీరిద్దరి వివాహం మరో నెల రోజుల్లోనే జరగబోతున్నట్లు సమాచారం అందుతోంది. ప్రస్తుతానికి అయితే ఎంగేజ్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారు. ఇది ఇలా ఉండగా%ా% ఇటీవల ప్రకటించిన టీమిండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగే టి20 సిరీస్ స్క్వాడ్ లో రింకూ సింగుకు స్థానం దక్కిన సంగతి తెలిసిందే.

## ఖేల్ రత్న పురస్కారాలను ప్రదానం



ఢిల్లీ: భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్చంద్ ఖేల్రత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో.. చెస్ ప్లేయర్ డి.గుకేశ్ , హాకీ స్టార్ హర్మన్ప్రీత్ సింగ్ ), పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ , షూటింగ్లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఈ అవార్డులు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు జివాంజీ దీప్తి (పారా అథ్లెటిక్స్), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్) పురస్కారాలను స్వీకరించారు. వీరితోపాటు మరో 32 మంది అర్జున, ఐదుగురు ద్రోణాచార్య పురస్కారాలు అందుకున్నారు. లైఫ్టైం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్బాల్) పురస్కారాలు స్వీకరించారు.

**అర్జున అవార్డులు అందుకుంది వీరే..**

అన్ను రాణి (అథ్లెటిక్స్)
నీతూ (బాక్సింగ్)
స్వీటీ బురా (బాక్సింగ్)
వంతిక అగర్వాల్ (చెస్)
సలీమా (హాకీ)
అభిషేక్ (హాకీ)
సంజయ్ (హాకీ)
జర్మన్ప్రీత్ సింగ్ (హాకీ)
సుఖ్జీత్ సింగ్ (హాకీ)
స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్)
సరబ్జోత్ సింగ్ (షూటింగ్)
అభయ్ సింగ్ (స్క్వాష్)
సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్)
అమన్ (రెజ్లింగ్)
రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్)
ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్)
అజీత్సింగ్ (పారా అథ్లెటిక్స్)
సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్)
ప్రణవ్ సూర్య (పారా అథ్లెటిక్స్)
హెచ్. హొకాటో సీమ (పారా అథ్లెటిక్స్)
సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్)
నవ్దీప్ (పారా అథ్లెటిక్స్)
నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్)
తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్)
నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)
మనీశా రాందాస్ (పారా బ్యాడ్మింటన్)
కపిల్ పర్మార్ (పారా జూడో)
మోనా అగర్వాల్ (పారా షూటింగ్)
రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్)
అర్జున అవార్డ్స్ (లైఫ్టైమ్)
సుచా సింగ్ (అథ్లెటిక్స్)
మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్)
ద్రోణాచార్య అవార్డులు (కోచ్లు)
సుభాష్ రాణా (పారా షూటింగ్)
దీపాలీ దేశ్పాండే (షూటింగ్)
సందీప్ సంగ్వాన్ (హాకీ)

## విశ్వనాథన్ ఆనంద్‌పై కార్ల్‌సన్ విమర్శలు

### తీవ్రంగా స్పందించిన ఫిడే చీఫ్



భారత్లో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచే దిగ్గజ చెస్ ప్లేయర్ విశ్వనాథన్ ఆనంద్ పై ప్రస్తుత స్టార్ మాగ్నస్ కార్ల్సన్ గత వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్షిప్ సందర్భంగా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశాడు. తనను టోర్నీ నుంచి బయటకు పంపాలనే ఉద్దేశంలో ఆనంద్తో పాటు ఫిడే అధికారులు ఉన్నట్లు వ్యాఖ్యానించాడు. వాటిపై తాజాగా ఫిడే అధ్యక్షుడు ఆర్కడే డ్వోర్కోవిచ్ ఘాటుగా స్పందించాడు. ఆనంద్ వంటి సీనియర్లతో పాటు ఫిడే అధికారులపై ఏదైనా వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉం దాలని హెచ్చరించాడు. ఇక్కడెవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయకూడదని హితవు పలికాడు.

# మహిళల ప్రీమియర్ లీగ్ షెడ్యూల్



క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) షెడ్యూల్ గురువారం విడుదలైంది. ఫిబ్రవరి 14న ఈ టోర్నీ ప్రారంభం కాబోతోంది. మార్చి 15న ముంబైలో ఫైనల్ మ్యాచ్ జరగనుందని బీసీసీఐ ప్రకటించింది. ఫిబ్రవరి 14న తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సిబి - గుజరాత్ జట్లు తలపడబోతున్నాయి. ఈ మ్యాచ్ కి బరోడాలో కొత్తగా నిర్మించిన బీసీఏ స్టేడియం వేదిక కానుంది.

ఈ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ థర్డ్ ఎడిషన్ మొత్తం నాలుగు వేదికలలో నిర్వహించబోతున్నట్లు బిసిసిఐ పేర్కొంది. బెంగళూరు, లక్నో, వడోదర, ముంబై వేదికలుగా ఈ మ్యాచ్ లు జరగబోతున్నాయి. ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్ లు మాత్రం ముంబైలో జరుగుతాయని బీసీసీఐ పేర్కొంది. ఈ టోర్నీలో మొత్తం 22 మ్యాచ్ లు జరగనున్నాయి. అత్యధికంగా బెంగుళూరు 8 మ్యాచ్లకు అతిథ్యం ఇవ్వనుంది. ఐదు జట్లు, కెప్టెన్ల వివరాలకు వస్తే.. స్మృతి మందాన (ఆర్సిబి), మెక్ లానింగ్ (ఢిల్లీ), అలిస్సా హీలి (యూపీ), హర్మన్ ప్రీత్ కౌర్ (ముంబై).

**ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ పూర్తి షెడ్యూల్:**

**వడోదర:**

14 ఫిబ్రవరి 2025 గుజరాత్ జెయింట్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
15 ఫిబ్రవరి 2025 ముంబై ఇండియన్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్
16 ఫిబ్రవరి 2025 గుజరాత్ జెయింట్స్ vs యుపి వారియర్జ్
17 ఫిబ్రవరి 2025 ఢిల్లీ క్యాపిటల్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
18 ఫిబ్రవరి 2025 గుజరాత్ జెయింట్స్ vs ముంబై ఇండియన్స్
19 ఫిబ్రవరి 2025 యుపి వారియర్జ్ vs ఢిల్లీ క్యాపిటల్స్

**బెంగళూరు:**

21 ఫిబ్రవరి 2025 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs ముంబై ఇండియన్స్
22 ఫిబ్రవరి 2025 ఢిల్లీ క్యాపిటల్స్ vs యుపి వారియర్జ్
23 ఫిబ్రవరి 2025 బ్రేక్ డే
24 ఫిబ్రవరి 2025 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs యుపి వారియర్జ్
25 ఫిబ్రవరి 2025 ఢిల్లీ క్యాపిటల్స్ vs గుజరాత్ జెయింట్స్
26 ఫిబ్రవరి 2025 ముంబై ఇండియన్స్ vs యుపి వారియర్జ్
27 ఫిబ్రవరి 2025 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs గుజరాత్ జెయింట్స్
28 ఫిబ్రవరి 2025 ఢిల్లీ క్యాపిటల్స్ vs ముంబై ఇండియన్స్
1 మార్చి 2025 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs ఢిల్లీ క్యాపిటల్స్
2 మార్చి 2025 బ్రేక్ డే

**లక్నో:**

3 మార్చి 2025 యుపి వారియర్జ్ vs గుజరాత్ జెయింట్స్
4 మార్చి 2025 బ్రేక్ డే
5 మార్చి 2025 బ్రేక్ డే
6 మార్చి 2025 యుపి వారియర్జ్ vs ముంబై ఇండియన్స్
7 మార్చి 2025 గుజరాత్ జెయింట్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్
8 మార్చి 2025 యుపి వారియర్జ్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
9 మార్చి 2025 బ్రేక్ డే

**ముంబై:**

10 మార్చి 2025 ముంబై ఇండియన్స్ vs గుజరాత్ జెయింట్స్
11 మార్చి 2025 ముంబై ఇండియన్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
12 మార్చి 2025 బ్రేక్ డే
13 మార్చి 2025 ఎలిమినేటర్
14 మార్చి 2025 బ్రేక్ డే
15 మార్చి 2025 ఫైనల్

ఈ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ లు అన్నీ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం అవుతాయి. స్పోర్ట్స్ 18 హెడ్ ఎస్డి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్2025 మ్యాచ్లను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. అలాగే ఉచితంగానే జియో సినిమాస్లో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2025 మ్యాచ్ లు వీక్షించవచ్చు.



# హరి హర వీరమల్లు 'మాట వినాలి'



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ పాటను స్వయంగా పవన్ కళ్యాణ్ ఆలపించడం విశేషం. సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసే 'మాట వినాలి' లిరికల్ వీడియోతో 'హరి హర వీర మల్లు' సంగీత ప్రయాణం మొదలైంది. "వినాలి, వీరమల్లు మాట చెప్తే వినాలి" అంటూ తెలంగాణ మాండలికంలో పవన్‌కళ్యాణ్ చెప్పే హృద్యమైన పంక్తులతో పాట ప్రారంభమైన తీరు అమోఘం. అందరూ పాడుకునేలా అర్థవంతమైన పంక్తులు, శక్తివంతమైన జానపద బీట్ లతో 'మాట వినాలి' గీతం మనోహరంగా ఉంది. పెంచల్ దాస్ అందించిన సాహిత్యం లోతైన భావాన్ని కలిగి ఉంది. మంచి మాటలను వినడం మరియు వాటి నుండి వచ్చే జ్ఞానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ అద్భుతమైన సందేశంతో ఈ పాట సాహిత్యం నడిచింది. ప్రతి వాక్యం విలువైన జీవిత పాఠాలను అంది స్తుంది. జీవితంలో సానుకూలత మరియు ధర్మాన్ని స్వీకరించడానికి శ్రోతలను ప్రోత్సహిస్తుంది. అటవీ నేపథ్యంలో చిత్రీకరించిన 'మాట వినాలి' పాట విజువల్స్ ఆకట్టుకున్నాయి. అడవిలో మంట చుట్టూ వీరమల్లు అనుచరుల బృందం గుమిగూడినట్లుగా లిరికల్ వీడియోలో చూపించారు. ఇక పవన్ కళ్యాణ్ గ్రేస్ ఫుల్ డ్యాన్స్‌లు పాట విడుదలైన కొద్ది నిమిషాల్లోనే సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఎం.ఎం. కీరవాణి స్వరపరిచిన ఈ మనోహరమైన, ఆకర్షణీయమైన గీతం సంగీత ప్రియుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా ఉంది. ఇక పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హృదయపూర్వకంగా ఆలపించి ఈ పాటకు మరింత అందాన్ని జోడించారు. తనదైన గాత్రంతో మొదటి నుండి చివరి వరకు శ్రోతలను కట్టిపడేసేలా చేశారు.

# అజిత్ కుమార్ 'పట్టుదల' ట్రైలర్

అగ్ర కథానాయకుడు అజిత్‌కుమార్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'విడాముయర్చి'. 'పట్టుదల'గా విడుదల చేస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రం ఫిబ్రవరి 6న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతోంది. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి భారీ అంచనాలతో రూపొందుతోన్న ఈ సినిమా కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే 'పట్టుదల' సినిమా నుంచి విడుదలైన టీజర్, సాంగ్స్, ప్రమోషనల్ కంటెంట్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను నెక్ట్స్ రేంజ్‌కు తీసుకెళ్లే క్రమంలో మేకర్స్ 'పట్టుదల' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే..అజిత్ స్టైలిష్‌గా సాల్ట్ అండ్ పేపర్ లుక్‌తో నెవర్ బిఫోర్ అవతార్‌లో మెప్పించబోతున్నారు. ట్రైలర్‌లో తన వాళ్ల కోసం అజిత్ విలన్స్‌తో చేస్తున్న పోరాటాలు, అజిత్, చార్మింగ్ బ్యూటీ త్రిష మధ్య కుదిరిన క్యూట్ కెమిస్ట్రీతో పాటు అజర్ బైజాన్‌లో చిత్రీకరించిన యాక్షన్ సీక్వెన్స్‌లు అబ్బురపరుస్తున్నాయి. మరో వైపు యాక్షన్ కింగ్ అర్జున్ ఓ వైపు జైలులో ఖైదీగా, మరోవైపు స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. రెజీనా కసాండ్ర సైతం ఇప్పటి వరకు చేయనటువంటి వైవిధ్యమైన పాత్రలో అలరిస్తుందని ట్రైలర్‌లో ఆమెను చూస్తుంటేనే అర్థమవుతుంది.. ఇంకా ఈ చిత్రంలో ఆరవ్, నిఖిల్ నాయర్ తదితరులు ఇతర పాత్రల్లో మెప్పించనున్నారు.



# కల్కి2 కథేంటంటే?

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి 2898 ఎడి తెలుగు సినిమా చరిత్రలో ఒక బిగ్ రికార్డ్ అందుకున్న విషయం తెలిసిందే. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలకు ముందే భారీ అంచనాలు ఏర్పడి, విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లను సాధించింది. 1000 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టి తెలుగు సినిమా గర్వకారణంగా నిలిచింది. ఇప్పటికే కల్కి 2 సీక్వెల్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావడంతో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక నిర్మాత అశ్విని దత్ ఇటీవల కల్కి 2 గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సీక్వెల్ కథ మూడు ప్రధాన పాత్రల చుట్టూ తిరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పాత్రలు ప్రభాస్, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ లకు సంబంధించినవి కావడం విశేషం. నిర్మాత ఏమన్నారంటే.. మొదటి భాగంలో అమితాబ్ అశ్వత్థామ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉండగా, కమల్ హాసన్ కలి పాత్ర పరిమిత స్క్రీన్ టైమ్‌తో మాత్రమే ఉండింది. ఇది అభిమానులకు కొంత నిరాశ కలిగించింది. కానీ, కల్కి 2లో కమల్ హాసన్ పూర్తి స్క్రీన్ టైమ్‌లో కనిపించి, ప్రభాస్‌తో సన్నివేశాలు ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని కలిగిస్తాయని అశ్విని దత్ పేర్కొన్నారు. కమల్ హాసన్ ఇప్పటికే ప్రమోషన్ల సమయంలో తన పాత్ర గురించి వివరించి, ఇది రెండవ భాగంలో మరింత డెవలప్ అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో, ప్రభాస్, కమల్ మధ్య సన్నివేశాలు కథను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉంటాయని అంచనా. అమితాబ్ పాత్రకు ఈ సారి కూడా ప్రాధాన్యం ఉండడం విశేషం. దీపికా పదుకొణె పాత్ర కూడా రెండవ భాగంలో ప్రాముఖ్యాన్ని సాధిస్తుందని అశ్విని దత్ క్లారిటీ ఇచ్చారు. నూతన పాత్రలు ఈ సారి రావడం అనుమానమేనని నిర్మాత తెలిపారు. ఇది మొత్తం నారేటివ్‌ను ముగించేందుకు కేవలం ప్రధాన పాత్రల చుట్టూనే కథ సాగుతుందని చెప్పారు. సెకండ్ పార్ట్ 2026లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు అశ్విని దత్ స్పష్టం చేశారు. కల్కి 2 కథ, నిర్మాణ విలువలు, సాంకేతికతతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమాకు గర్వకారణంగా నిలిచే అవకాశం ఉంది. ఇక ఈసారి బాక్సాఫీస్ వద్ద పార్ట్ 2తో 2000 కోట్లు రావడం గ్యారెంటీ అనేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.



# విజయ్ సేతుపతి 'ACE' పవర్ ప్యాక్డ్ గ్లింప్స్

'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి లీడ్ రోల్ నటిస్తున్న 'ACE' స్పెషల్ గ్లింప్స్ విడుదలైంది. అరుముగ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, యోగి బాబు, బి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లు, రాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. కరణ్ భగత్ రౌత్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ పవర్ ఫుల్ మ్యూజిక్‌తో 'ACE' గ్రేట్ కమర్షియల్ ఎంటర్ టైనర్‌గా ఉంటుందని హామీ ఇచ్చింది. ఎడిటింగ్‌ను ఫెన్నీ ఆలివర్, ఆర్ట్ డైరెక్టర్ ఎ.కె. ముత్తు నిర్వహిస్తున్నారు. 7సిఎస్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌పై అరుముగకుమార్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సినిమా టైటిల్ టీజర్ విడుదలైన వెంటనే సంచలనం సృష్టించింది, మిలియన్ల వ్యూస్ సంపాదించి రికార్డులు సృష్టించింది. ఇప్పుడు, విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా, టీం ఈ ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది, ఇది అభిమానులలో మరింత ఉత్సాహాన్ని పెంచుతుంది. ఈ గ్లింప్స్‌లో విజయ్ సేతుపతి 'బోల్డ్ కన్నన్'గా సాంప్రదాయ తమిళ దుస్తులు ధరించి, మలేషియాలోని విమానాశ్రయంలో డైనమిక్‌గా నడుస్తూ, హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలలో పాల్గొంటూ, ఫెస్టివల్‌లో డ్యాన్స్ చేస్తూ కనిపించడం అలరించింది.



# బిజీ బిజీ బ్యూటీ

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ షిఫ్ట్ అయిన అందాల భామ ప్రియాంక చోప్రా ఇంగ్లీష్ సినిమాలు, సీరీస్ లు చేసుకుంటూ ఫుల్ బిజీ అయ్యింది. ఇండియన్ సినిమా ఆఫర్లు వస్తున్నా కూడా ఒక్క దానికి కూడా అమ్మడు ఇంట్రెస్ట్ చూపించట్లేదని తెలుస్తుంది. 2015 లో బాజీరావ్ మస్తాని, 2016లో జై గంగాజల్ సినిమాల్లో నటించిన ప్రియాంక చోప్రా ఆ నెక్ట్స్ ఇయర్ బేవాచ్ ఛాన్స్ అందుకుని హాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. ఇక అప్పటి నుంచి అమ్మడికి తిరుగు లేని విధంగా క్రేజ్ తెచ్చుకుంది. ప్రియాంక చోప్రా నిక్ జోనస్ తో పెళ్లి తర్వాత ప్రియాంక పూర్తిగా హాలీవుడ్ కే పరిమితమైంది. ప్రియాంక చోప్రా ని హిందీ మేకర్స్ కన్సల్ట్ అయినా కూడా ఆమె చేయలేనని చెప్పడం కామన్ అయ్యింది. హాలీవుడ్ వెళ్లాక బాలీవుడ్ ని చిన్న చూపు చూస్తుందని కొందరు హడావిడి చేసినా కూడా వాటిని అసలు ఏమాత్రం పట్టించుకోకుండా లైట్ తీసుకుంది అమ్మడు. ఆఫ్టర్ లాంగ్ టైం ప్రియాంక చోప్రా ఒక ఇండియన్ సినిమాలో నటిస్తుందని వార్తలు వస్తున్నాయి. అది కూడా సూపర్ స్టార్ మహేష్, రాజమౌళి కాంబోలో వస్తున్న సినిమాలో అమ్మడు నటిస్తుందని టాక్. ఈ సినిమాను ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కిస్తారని తెలుస్తుంది. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తే గ్లోబల్ వైజ్‌గా ఈ ప్రాజెక్ట్ కి క్రేజ్ వస్తుంది. ఐతే ఈమధ్య హిందీ సినిమాలకే తాను ఓకే చెప్పని ప్రియాంక మహేష్ సినిమాకు ఓకే చెబుతుందా లేదా అన్నది తెలియాల్సి ఉంది. మహేష్ 29వ సినిమానే కాదు ప్రియాంక చోప్రా జోనస్ బ్రదర్స్ చేస్తున్న సినిమాలో కూడా నిక్ జోనస్‌తో కలిసి ప్రియాంక ఆన్ స్క్రీన్ రొమాన్స్ చేయనుంది. మరి భర్తతో కలిసి మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న ఆ ప్రాజెక్ట్ ఎలా ఉంటుందో చూడాలి. ప్రియాంక చోప్రా సినిమా కోసం ఇండియన్ సినీ లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. మరి ఎస్ఎస్ఎమ్‌బి 29 సినిమాలో ప్రియాంక నటిస్తుందా లేదా. అసలు ఈ సినిమా ఆఫర్ అమ్మడిదాకా వెళ్లిందా లేదా అన్నది కూడా క్లారిటీ రావాల్సి ఉంది.



# బ్లాక్ అవుట్ ఫిట్ బ్యూటీ

తెలుగు ప్రేక్షకులకు ఓం భీమ్ బుష్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, మనమే సినిమాలతో పరిచయం అయిన ముద్దుగుమ్మ ఆయేషా ఖాన్. మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలతో ఆకట్టుకుంటూ ఉంది. హిందీ బిగ్ బాస్ సీజన్ 17లో కనిపించిన ఈ అమ్మడు ఆ తర్వాత బుల్లి తెరపై చాలా షోల్లోనూ నటించి హిందీ ప్రేక్షకులకు చేరువ అయ్యింది. హిందీ సినిమాల్లో ప్రయత్నిస్తున్న సమయంలో టాలీవుడ్ నుంచి ఈ అమ్మడికి ఛాన్స్‌లు వచ్చాయి. హీరోయిన్ పాత్రల్లో నటించడం కోసం తాపత్రయ పడుతున్న ఈ అమ్మడు మెల్ల మెల్లగా అటువైపుగా వెళ్తుంది. ఏక్తా కపూర్ యొక్క కసౌతి జందగీ కే ఆకట్టుకున్న ఆయేషా ఖాన్ బుల్లి తెరపై హీరోయిన్ రేంజ్ గుర్తింపు దక్కించుకుంది. మంచి ఫిజిక్‌తో పాటు హీరోయిన్స్ రేంజ్‌లో స్కిన్ షో చేయడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. హిందీ సినిమా ఇండస్ట్రీలో చిన్నా చితకా ఆఫర్లు వచ్చినా పెద్దగా పట్టించుకోని ఈ అమ్మడు టాలీవుడ్‌లో సినిమా ఆఫర్లు దక్కించుకుంది. అందమైన ఈ అమ్మడు తెలుగులో మొదటగా ముఖచిత్రం అనే సినిమాలో నటించింది. ఆ సినిమాతో పెద్దగా గుర్తింపు రాలేదు. అయినా తన ప్రయత్నం ఆపలేదు. తెలుగులో సినిమా ఆఫర్లు సొంతం చేసుకుంటూనే ఉంది. ఏ సినిమాకు ఎంత టైమ్ పట్టిందంటే.. తాజాగా సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడు అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 5.5 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ అంటూ నెటిజన్స్ రెగ్యులర్‌గా ఈమె ఫోటోలకు ఫిదా అవుతూ కామెంట్స్ చేస్తు ఉంటారు. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో ముక్కు పుడకతో కవ్వించే చూపులతో స్టైలిష్ ఫోజ్ ఇచ్చిన ఈ అమ్మడి ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నార్త్ లెక్కలు ఇలా.. తెలుగులో గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో ఈమె ఒక పాటలో కనిపించి కన్నుల విందు చేసింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో రూపొందుతున్న జాట్ సినిమాలో నటిస్తోంది. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాతో బాలీవుడ్‌లో మొదటి సారి కనిపించబోతుంది. ఈసారిపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇటీవల విడుదల అయిన ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన దక్కింది. అందుకే ఈ సినిమా కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా హిట్ టాక్ సొంతం చేసుకుంటే తప్పకుండా బాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా ఆయేషా ఖాన్ నిలిచే అవకాశాలు ఉన్నాయి.




# సంక్రాంతి 'గేమ్' మారింది

సంక్రాంతి పండుగ హడావుడిలో తెలుగు బాక్సాఫీస్ గేమ్ కొత్త మలుపులు తీసుకుంటోంది. అయితే ఈ గేమ్ లో దిల్ రాజు ఒక్కరే మూడు ఆటలు అడుతుండడం విశేషం. రెండు సినిమాలు సొంత ప్రొడక్షన్ లో రాగా మరో సంస్థలో నచ్చిన డాకు మహరాజ్ నైజాం రైట్స్ కూడా తనే తీసుకొని స్ట్రాటజీతో రిలీజ్ చేశారు. ఎవరితో ఎలాంటి గోడవ లేకుండా తనకు తానే పోటీగా నిలబడ్డారు. ఈ ఆటలో రాజుగారు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన టైమొచ్చింది. పెద్ద బడ్జెట్‌తో, భారీ అంచనాల మధ్య విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్ మొదట ఆధిపత్యం చూపించినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. సంక్రాంతి రేసులో బాలకృష్ణ డాకు మహారాజ్ మాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకోగా, వెంకటేష్ "సంక్రాంతికి వస్తున్నాం" సూపర్ పాజిటివ్ టాక్‌తో ముందుకు దూసుకెళ్తోంది. అయితే గేమ్ చేంజర్ కి భారీ థియేటర్ల కలెక్షన్లు సాధించడంలో స్లోగా మొదలైంది. మౌత్ టాక్ ప్రభావంతో స్క్రీన్లలో జనాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. మరోవైపు, రెండు రోజుల గ్యాప్‌లో రిలీజ్ అయిన డాకు మహారాజ్ బాక్సాఫీస్ వద్ద నిలబడుతూనే ఉంది. "సంక్రాంతికి వస్తున్నాం"కి డిమాండ్ అమాంతం పెరగడంతో వెంకటేష్ సినిమాకు ప్రేక్షకులు వెనకడుగు వేయడం లేదు. ఇటీవల విడుదలైన "సంక్రాంతికి వస్తున్నాం" విడుదలైన ప్రతీ ఏరియాలో అదిరిపోయే వసూళ్లు రాబడుతోంది. మొదటి రెండు రోజుల్లో టికెట్లు దొరకక ప్రేక్షకులు అసహనానికి గురయ్యారు. అలాగే స్క్రీన్ల పరంగా మరింత అన్యాయం జరిగినట్లు అనిపిస్తోంది. ఈ చిత్రం ఓవర్ ఫ్లో ఆడియెన్స్‌ను ఆకర్షించగా, "గేమ్ చేంజర్" స్క్రీన్లు ఎక్కువగా ఖాళీగా కనిపించాయి. దిల్ రాజు నిర్మించిన ఈ రెండు చిత్రాల విషయంలో తగిన సమతుల్యత కల్పించడానికి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. "గేమ్ చేంజర్" స్క్రీన్ల సంఖ్య తగ్గించి, వీకెండ్‌లో "సంక్రాంతికి వస్తున్నాం"కి ఎక్కువ స్క్రీన్లు కేటాయించనున్నారు. ఈ నిర్ణయం వ్యాపార దృక్పథంతో తీసుకున్నప్పటికీ, రామ్ చరణ్ అభిమానులు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి వీకెండ్‌లో "సంక్రాంతికి వస్తున్నాం" భారీ వసూళ్లు సాధించి బాక్సాఫీస్‌ను షేక్ చేయనుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇక "గేమ్ చేంజర్" పరిమిత స్క్రీన్లలో తన ప్రదర్శనను కొనసాగిస్తే చాలని దిల్ రాజు భావిస్తున్నారు అని ప్రచారం నడుస్తుంది . వెంకటేష్ చిత్రానికి వచ్చే ఆదాయం దృష్ట్యా ఈ నిర్ణయం సరైనదని ఆయన జడ్జ్ చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, "సంక్రాంతికి వస్తున్నాం" ఆడియెన్స్ హృదయాలను గెలుచుకుంటూ, సంక్రాంతి సీజన్ విజేతగా నిలవడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రెండో వీకెండ్ కలెక్షన్ల ద్వారా ఈ సీజన్ విజేత ఎవరో తేలిపోతుంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044





ప్రతి నెల మూడవ శనివారం

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పిలుపును
అందుకుందాం. ప్రతి నెల మూడవ శనివారాన్ని
'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' దినంగా పాటిద్దాం.

పరిశుభ్రం ఆరోగ్యం
ఒక అడుగు ముందుకు స్వచ్ఛత వైపు

**మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట శుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందాం.**





## 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాలు

- ఇంటింటి నుంచి 100% చెత్త సేకరణ
- చెత్తను 100% తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడం
- ఘన వ్యర్థాలను 100% శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం
- తిరిగి ఉపయోగించగల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం
- చెత్త కుప్పలు లేని సమాజం
- 100% వాడుక నీటి నిర్వహణ
- 100% ఓడిఎఫ్ ప్లస్ ఆదర్శ గ్రామాలు

జారీ చేసినవారు : స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్

**ప్రజలారా రండి! 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాల సాధనలో ప్రభుత్వానికి సహకరించండి**